



ఒక్కో మంచంపై ఇద్దరేసి బాలింతలు (ఫైల్)

- 560 పడకలు.. 1200 మంది ఇన్ పేషెంట్లు
- కిటకిటలాడే క్యాజువాలిటీలో 20 పడకలు
- ఓపీకి రోజుకు రెండు వేలకు పైగా రోగులు
- అరకొర వైద్యులు.. సిబ్బందిపై పనిభారం
- ప్రైవేటుకు వెళ్లినా.. టైం బాగుంటేనే కోలుకుంటారు
- కాంగ్రెస్, టీడీపీ-బీజేపీ, వైసీపీ.. అన్నీ మాటల ప్రభుత్వాలే..!



పడకేసిన పడకలు..!

పేదరికం నుంచి గట్టెక్కని పెద్దాసుపత్రి



పడకలు లేవు.. చాపపై సర్దుకోవాల్సిందే..

అనంతపురం టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నిజం నిష్ఠూరంగానే ఉంటుంది. జిల్లా సర్వజన వైద్యశాల పరిస్థితులను ఇప్పటి వర కూ ఏ ప్రభుత్వమూ మెరుగుపరచలేదు. ఆస్పత్రి తనిఖీలకు వెళ్లినప్పుడు వైద్య ఆరోగ్యశాఖ మం త్రులు, ఉన్నతాధికారులు, ఇతర ప్రజా ప్రతినిధు లు హడావుడి చేయడం, వైద్యాధికారులు, వైద్యు లు, సిబ్బంది తీరుపై మండిపడటం మినహా మౌ లిక వసతుల కల్పనకు పెద్దగా చర్యలు తీసుకున్నది లేదు. సుమారు పదిహేనేళ్ల నుంచి జిల్లా సర్వజన వైద్యశాలలో పడకలను పెంచాలన్న డిమాండ్ ఉంది. మొత్తంగా 560 పడకలు ఉన్న ఈ ఆస్పత్రిలో.. సగటున 1200 మంది రోగులు సర్దుకుంటున్నారంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏ రోజు, ఏ సమయం లో వెళ్లినా క్యాజువాలిటీ జాతరను తలపిస్తుంది. కానీ అక్కడున్నవి 20 పడకలు మాత్రమే. అత్యవసర రోగులకు నరకం కనిపిస్తుంది. ఒక్కోపడకపై ఇద్దరిని పడుకోబెట్టి.. నలుగురిని కూర్చోబెట్టి వైద్యం చేస్తుంటారు. కొందరికి ఆ మాత్రం చోటూ లేక.. కింద కూలబడి పోతుంటారు. ఈ క్రమంలో కొందరు రోగులు, వారి సహాయకులు వైద్యులు, సిబ్బందితో గొడవ పడుతుంటారు.

ఇకనైనా మారుతుందా..?

ప్రసూతి, నవజాత శిశు విభాగాలు, సర్జరీ, ఆర్థో, చిన్న పిల్లల వార్డులలో సంభవించే మరణాలు వివాదాస్పదం అవుతున్నాయి. నడవలేని రోగులకు వీల్ చైర్లు, స్ట్రెచర్లు తగినన్ని లేవు. అప్పుడప్పుడు దాతలు స్పందించి కొన్ని సమకూరుస్తున్నా.. సరిగా వినియోగించడం లేదు. సిబ్బంది కొరత దీనికి ప్రధాన కారణం. బంధువులు, కుటుంబ సభ్యులే వార్డ్ బాయ్‌లుగా మారి.. రోగులను మోసుకుపోయే దృశ్యాలు నిత్యం కనిపిస్తుంటాయి. ఇవన్నీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలియనివి కాదు. అయినా పరిష్కారం కావడం లేదు. ఏడాదిన్నర తరువాత ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కొత్త కమిటీకి ఇది తొట్టతొలి సమావేశం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వచ్చిన కమిటీ ఇది. ఇప్పటినుంచైనా పరిస్థితులలో మార్పు వస్తుందా..? పడకలను పెంచి.. మౌలిక వసతులను కల్పిస్తారా..? మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తారా..? మునుముందు తెలుస్తుంది.

ఇదీ వరుస..

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పడకల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. దీని కోసం 124 జీఓను విడుదల చేశారు. పదేళ్ల పాటు పాలించారు. కానీ ఒక్క పడకా పెరగలేదు. వసతులు మెరుగుపడలేదు. జీఓ కాగితాలకే పరిమితమైంది. మాటలు ఉత్తివే అని తేలిపోయింది. ఆ తరువాత టీడీపీ-బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. నాటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆస్పత్రిని సందర్శించారు. పడకలను పెంచడానికి కృషి చేస్తామని చెప్పారు. కాలం గడిచిపోయింది. పరిస్థితిలో మార్పు రాలేదు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. మాటలకు పరిమితమైంది. పరిస్థితి మరింత దిగజారింది. ఇప్పుడు కూటమి ప్ర భుత్వం ఉంది. మరో నాలుగేళ్లకు పైగా అధికారం ఉంటుంది. జిల్లా ప్రజలు ఏకపక్ష విజయాన్ని అందించారు. రుణం తీర్చుకునేందుకైనా మెరుగైన వైద్యాన్ని కానుకగా ఇవ్వాలి. ఇస్తారా..? లేదా..? కాలమే చెబుతుంది. అడగంది అమ్మయినా బువ్వ పెట్టదు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు చొరవ చూపితే.. ఇదేమంత కష్టమైన పనికాదు.

ప్రైవేటులో వ్యాపారమే..

సర్వజన వైద్యశాల దుస్థితి కారణంగా పేద, మధ్యతరగతి ప్రజలు సైతం ప్రైవేటు, కార్పొరేటు వైద్యం వైపు వెళుతున్నారు. అప్పులు చేసి ఖర్చు పెడుతున్నారు. అయినా మెరుగైన వైద్యం 'అదృష్టం'పై ఆధారపడి ఉంటోంది. చిన్న చిన్న జబ్బులకూ రూ.లక్షలు పిండుతున్నా.. రోగం నయమౌతుందన్న గ్యారెంటీ లేదు. సాధ్యమైనంత పిండుకుని, ఆ తరువాత చేతులెత్తేస్తున్నారు. 'రెఫర్' అని రాసి.. రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆస్పత్రుల వద్ద ఆందోళనకు దిగుతున్నారు. ప్రభుత్వ వైద్యం మెరుగ్గా ఉంటే.. కరువు జిల్లా ప్రజలకు ఇన్ని కష్టాలు ఉండవు కదా..? ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రులకు వెళితే.. టోకెన్ రూ.300 నుంచి రూ.500 వరకూ తీసుకుంటున్నారు. వాటికి అనుబంధంగా ఏర్పాటు చేసుకున్న మెడికల్ షాపులలోనూ దోపిడీ జరుగుతోంది.

సూపర్.. అంతంతే..

జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోనూ సమస్యలు రాజ్యమేలేతున్నాయి. ఇక్కడ పూర్తిస్థాయిలో ఓపీ సేవలు లేవు. వారినికి రెండు రోజులు మాత్రమే ఓపీలను నిర్వహిస్తున్నారు. సీరియస్ కేసులైన కార్డియాలజీ, కిడ్నీ, న్యూరో సర్జరీ బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నిత్యం ఓపీ సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు. తగినంతమంది వైద్యులు, సిబ్బంది కూడా లేరు. చాలావాటికి పెద్దాసుపత్రిపైనే ఆధారపడుతున్నారు.



అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి, కలెక్టర్, ఎంపీ అంబికా

చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తాం

జిల్లా సర్వజన వైద్యశాలను చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సూపర్ స్పెషాలిటీలో గురువారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఆస్పత్రిలో సౌకర్యాలు ఉన్నా, ఏవో కారణాలు చూపుతూ సర్జరీలు చేయకపోవడం సరికాదని కలెక్టర్ అన్నారు. ఇకపై అన్ని విభాగాల్లో సర్జరీలు తప్పనిసరిగా జరగాలని అన్నారు. ఖాళీలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. తల్లిపాల డెయిరీకి రూ.10 లక్షలు ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాకు కీలకమైన ఆస్పత్రి అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎంపీ అంబికా అన్నారు. క్యాజువాలిటీని 40 పడకలకు విస్తరించేందుకు ఎంపీ లాడ్స్ నుంచి నిధులు ఇస్తానని, నివేదిక ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా సర్వజన ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ప్రేమ గొడవ

అదృశ్యమైన కూతురి కోసం తల్లిదండ్రుల ఆందోళన

తలను గోడకేసి కొట్టుకున్న యువతి తండ్రి

అనంతపురం క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రేమ జంట వ్యవహారం వన్‌టౌన్ పోలీసులకు తలనొప్పిగా మారింది. యువతి అదృశ్యమై వారం గడిచినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణంలో యువతి తండ్రి తల గోడకేసి కొట్టుకున్నాడు. రక్తగాయాలతో నిరసన తెలిపాడు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తాజా పరిస్థితిని వారికి వివరించారు. అనంతపురం నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన ఓ యువతి ఈ నెల 23న అదృశ్యమైంది. ఆమె విశాఖపట్నంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతోంది. సంక్రాంతి సెలవులకు వచ్చి.. మాయమైంది. దీంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఆ యువతి, సమీపంలోని ఓ ఇంట్లో ఉంటున్న స్టీలు సామాన్లు విక్రయించే దిలీప్ కుమార్‌తో కలిసి వెళ్లినట్లు నిర్ధారించారు. వారు పెళ్లి చేసుకున్న ఫొటోలను తాజాగా సమీప బంధువులకు పంపించారని తెలిసింది. ప్రేమ జంట ప్రస్తుతం గోవాలో ఉన్నట్లు సమాచారం. వారిని తీసుకువచ్చేందుకు ఇద్దరు పోలీసులు వెళ్లినట్లు తెలిసింది. పెళ్లి విషయం తెలియగానే యువతి తల్లిదండ్రులు, బంధువులు గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిరసనకు దిగారు. యువతి తండ్రి గోడకేసి తలను బాదుకోవడంతో రక్తం వచ్చింది. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ వారితో మాట్లాడారు. బాధితులు పోలీసులతో వాదనకు దిగారు. తమ బిడ్డను చనిపోయాక పిలుచుకొస్తారా అని ప్రశ్నించారు. అమ్మాయిలను మభ్యపెట్టి మోసం చేస్తున్నాడని, అలాంటివాడు తన కూతురిని ఏం చేస్తాడో తెలియడం లేదని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సీఐ వారిని ఓదార్చారు. వారు ఎక్కడున్నదీ గుర్తించామని, వీలైనంత త్వరగా తీసుకువస్తామని అన్నారు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. గాయపడ్డ యువతి తండ్రిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో యువతి కుటుంబ సభ్యుల ఆందోళన

జాకీని తిరిగి తీసుకురండి

తాగునీటి పైప్‌లైన్ పనులను చేపట్టండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి



టూరిజం బ్రోచర్లను ఎమ్మెల్యే పరిటాల సునీతకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో తాగునీటి పైపులైన్ల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయనను కలిశారు. పంపనూరు ఫారెస్ట్‌లో 2.1 కి.మీ. క్లియరెన్స్, వేపచెర్ల ఫారెస్ట్‌లో కి.మీ క్లియరెన్స్, కూడేరు మండలం చోళసముద్రంలో పైపులైన్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించాలని కోరారు. తద్వారా పాపంపేట, కక్కలపల్లి కాలనీలకు తాగునీరు త్వరితగతిన అందుతుందని అన్నారు. జలజీవన్ పథకం ద్వారా పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు మండలంలోని 25 గ్రామాలు, అనంతపురం రూరల్ మండలంలోని 23 గ్రామాలకు తాగునీరు ఇచ్చేందుకు రూ.35 కోట్లు మంజూరయ్యాయని, అందులో రూ.28 కోట్ల పనులు జరిగాయని తెలిపారు. రాప్తాడు మండలానికి రూ.3 కోట్లు మంజూరైనా పనులు జరగలేదని, వాటిని పూర్తి చేయించాలని కోరారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. జాకీ పరిశ్రమ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, తిరిగి పరిశ్రమ ఏర్పాటయ్యేలా చూడాలని కోరారు. ఆ సంస్థ రాకపోతే కొత్త గార్మెంట్స్ పరిశ్రమలు తీసుకురావాలని కోరారు. పీఏబీఆర్ కుడికాలువకు నీరు నిలిపేశారని, ఇంకా 20 శాతం చెరువులు నిండలేదని అన్నారు. వచ్చే నెల 15 వరకూ చెరువులకు నీరందించాలని విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేస్తే రైతులు నష్టపోతారని, దీని బదులుగా కాలువను విస్తరించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తానని మిగిలినవాటిని సీఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎటర్నల్ అనంత పేరుతో రూపొందించిన హెరిటేజ్ టూరిజం సర్క్యూట్, ఎకో టూరిజం సర్క్యూట్, రిలీజియస్ సర్క్యూట్, అనంతపురం క్లస్టర్, కళ్యాణదుర్గం క్లస్టర్, తాడిపత్రి క్లస్టర్ బ్రోచర్లను కలెక్టర్‌కు ఎమ్మెల్యే అందజేశారు. ప్రాచీన కట్టడాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యుల వాగ్వాదం

జడ్పీలో జగడం..!

గంటన్నరపాటు గరం... గరం..!

సర్వసభ్య సమావేశంలో వాగ్వాదం

వాట్సాప్ పాలనపై ప్రభుత్వానికి టీడీపీ ఎమ్మెల్యేల ధన్యవాద తీర్మానం

సూపర్ సిక్స్ అమలుపై వైసీపీ సభ్యుల విమర్శలు

అధికార, విపక్ష సభ్యుల అరుపులతో దద్దరిల్లిన సభ

అనంతపురం విద్య, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో జగడం సాగింది. మూడున్నరేళ్లలో ఎన్నడూ లేనంత రచ్చ. గంటన్నరపాటు హైవోల్టేజ్ రగడ. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వైసీపీ జడ్పీటీసీల మధ్య వాగ్వాదంతో జడ్పీ సర్వసభ్య సమావేశం దద్దరిల్లింది. సూపర్ సిక్స్ పథకాల అమలు, వైసీపీ పాలనలో అభివృద్ధిపై వైసీపీ జడ్పీటీసీలు, టీడీపీ ఎమ్మెల్యేల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో ఒకానొక స్థాయిలో కొట్టుకుంటారా అన్నట్టుగా ఘర్షణ పడ్డారు. మూడుసార్లు గొడవ పడ్డారు. తర్వాత ఎలాంటి చర్చ లేకుండా అర్ధంతరంగా సభను ముగించారు. స్థానిక జడ్పీ మీటింగ్ హాల్‌లో (మిగతా 7లో..)



జడ్పీలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

పట్టపగలే చోరీ

15 తులాల బంగారం, రూ.2 లక్షలు మాయం

పెద్దపప్పూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామంలో పట్ట పగలే దొంగలు చొరబడ్డారు. ఓ ఇంట్లో రూ.2 లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. గ్రామానికి చెందిన కుర్లా రమేశ్వర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం తోటకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తాళం తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే.. బీరువా తలుపులు బద్ధలై కనిపించాయి. బట్టలు, కాగితాలు చిందర వందరగా ఉన్నాయి. బంగారు ఆభరణాలు, నగదు మాయమ్యాయి. వెనుకవైపు నుంచి దొంగలు ఇంటిలోకి ప్రవేశించి చోరీ చేశారని బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ గ్రామానికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేస్తామని తెలిపారు.



దొంగలు పగలగొట్టిన బీరువా

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయారా..?

మంత్రి ఇంటికి వార్డెన్లు, పర్యవేక్షణాధికారి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి రికార్డులు రాయకుండా నిర్లక్ష్యం వహించిన వార్డెన్లు.. మంత్రి వద్ద పంచాయితీ పెట్టేందుకు ప్రయత్నించి చిక్కుల్లో పడ్డారు. ఉరవకొండలోని ఎస్సీ నంబర్ 1, 2 బాలికల వసతి గృహాలు, నంబర్ వన్ బాలుర వసతి గృహం, రాకెట్ల బాలుర వసతిగృహాల వార్డెన్లు రికార్డులు నమోదు చేయలేదు. హాజరు నమోదులో అవకతవకలు జరిగాయి. ఈ వ్యవహారంలో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అయినా వారు తీరును మార్చుకోకపోగా, ఎస్సీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారిపై తిరుగుబాటు చేసేందుకు ప్రయత్నించారు. మంత్రి పయ్యావుల కేశవ్ వద్ద పంచాయితీ పెట్టేందుకు ప్రయత్నించారు. పర్యవేక్షణాధికారితో కలిసి మంత్రి ఇంటికి చేరకుని ఉన్నతాధికారిపై ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ వెల్ఫేర్ డీడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డికి మంత్రి ఇంటి నుంచి పిలుపు వచ్చింది. ఆయన ఆధారాలతో మంత్రి ఇంటికి చేరుకోవడంతో ఐదుగురూ జారుకున్నట్లు తెలిసింది. ఆ శాఖలోని కొందరు అధికారులు డీడీని మంత్రి ఇంటి నుంచి పిలుచుకువెళ్లినట్లు సమాచారం. ఆ తరువాత నలుగురు వార్డెన్లు, పర్యవేక్షణాధికారి డీడీ కార్యాయానికి వెళ్లి.. క్షమాపణ చెప్పినట్లు తెలిసింది. వార్డెన్ల వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. వార్డెన్లను రెచ్చగొట్టి.. ఉన్నతాధికారిని టార్గెట్ చేయించడం వెనుక ఓ పర్యవేక్షణాధికారి ఉన్నట్లు తెలిసింది.

రిజిస్ట్రేషన్ల కోసం అవస్థలు

పనిచేయని సర్వర్.. రిజిస్ట్రేషన్లు నిల్
రేపటి నుంచి పెరిగిన ధరలతో రిజిస్ట్రేషన్లు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వేచిచూస్తున్న క్రయ, విక్రయదారులు

యాడికి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయ, విక్రయదారులతో గురువారం యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కిక్కిరిసింది. ఫిబ్రవరి 1నుంచి పెంచిన మార్కెట్‌వాల్యూ ధరలతో రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇదివరకే స్థలాలు, భూముల కొనుగోలుకు అగ్రిమెంట్లు చేసుకున్న వారు రిజిస్ట్రేషన్ కోసం గురువారం యాడికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచిచూడడం కనిపించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచి సర్వర్ పనిచేయలేదు. ఈ కారణంగా గురువారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా కాలేదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దనే క్రయ, విక్రయదారులు సాయంత్రం వరకు వేచిచూసి వెనుదిరగడం కనిపించింది. ఉదయం 10గంటల నుంచి రిజిస్ట్రేషన్ కోసం వేచిచూశామని, సర్వర్ పనిచేయడం లేదనే అధికారులు చెబుతున్నారని క్రయ, విక్రయదారులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్కెట్ వాల్యూధరలు పెరగనున్నాయని, రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చేయించుకుందామని వస్తే సర్వర్ పనిచేయని కారణంగా రిజిస్ట్రేషన్లు చేయలేమని అధికారులు చెప్పారని వారు వివరించారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ జాఫర్‌సాధిక్‌ను వివరణ కోరగా ఉదయం నుంచి సర్వర్‌పనిచేయని మాట వాస్తవమేనని, అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పరిస్థితి ఇలాగే ఉందన్నారు.

ధ్వంసమైన శాసనాల పరిశీలన



శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

కుందుర్పి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ధ్వంసమైన పురావస్తు శాసనాలను గురువారం అధికారులు పరిశీలించారు. కుందుర్పిలోని ఆంజనేయ, వీరభద్ర, నరసింహస్వామి ఆలయాలకు వెళ్లే వెమార్గంలో ఉన్న పురాతన శాసనాలను కొందరు ధ్వంసం చేయగా ఉమ్మడి జిల్లా పురావస్తు శాఖ ప్రదర్శన శాల సహాయ సంచాలకులు డాక్టర్ రజిత ఇంపాక్ట్ సంస్థకు కన్వీనర్ శ్రీనివాసులు, చరిత్రకారుడు నరసింహులు, తహసీల్దార్ శ్రీనివాసులు వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాసనాలను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఫిబ్రవరి 6న రంగనాథస్వామి
బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో లగ్నపత్రికను రాస్తున్న అర్చకులు

గుత్తి రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహోత్సవాలు ఫిబ్రవరి 6న నుంచి ప్రారంభమవుతాయని ఈఓ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆలయంలో అర్చకులు స్వామి వారి లగ్నపత్రికను రాశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లడుతూ ఫిబ్రవరి 12న స్వామి వారి కళ్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మురళీశర్మ, రవిస్వామి, రంగనాయకులు, ఆలయ మాజీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు బంద్ నిర్వహిస్తున్నట్లు ఐక్య విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ కాలేజీలో ఇటీవల విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకున్నా కళాశాల యాజమాన్యంపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. యాజమాన్యం క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్‌ఐఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు పరమేష్, పృథ్వీ, సురేష్ యాదవ్, చంద్రశేఖర్, చందు, గిరి, హేమంత్, సాయి, అజయ్, కార్తీక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.



దేవదాయ మైదానంలో ఉన్న బస్టాండ్



బళ్లారి రోడ్డులో తాత్కాలిక బస్టాండు



మొలకాల్మూరు రోడ్డులో ఉన్న తాత్కాలిక బస్టాండ్

ఒక ఊరు.. నాలుగు బస్టాండ్లు..!

- నిత్యం ట్రాఫిక్ సమస్య
- నిర్మానుష్యంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్
- రోడ్డు పక్కలోనే తాత్కాలిక బస్టాండ్లు

రాయదుర్గం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఒక ఊరికి ఒకే బస్టాండ్ ఉంటుంది. కానీ రాయదుర్గంలో మాత్రం నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. పట్టణంలోని ప్రజలు ఏదైనా ఊరికి వెళ్లాలంటే ఆ మార్గంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న బస్టాండ్ వద్దకు వెళ్లాలి. దీంతో నిత్యం పట్టణంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. 80 వేల మందికి పైగా జనాభా ఉన్న రాయదుర్గం పట్టణంలో అటు మొలకాల్మూరు రోడ్డులో బెంగుళూరుతో పాటు కర్ణాటక వైపు వెళ్లే బస్సులు, ఇటు బళ్లారిరోడ్డులో ప్రైవేటు, ఆర్టీసీ బస్సుల కోసం రోడ్డు పక్కనే తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణ నడిబొడ్డులో దేవదాయశాఖకు సంబంధించిన ఖాళీ స్థలంలో ప్రైవేటు, ఆర్టీసీ బస్టాండ్‌ను కొన్నేళ్ల నుంచి ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి అనంతపురంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ప్రధానంగా ఏపీఎస్ఆర్టీసీ అధికారికంగా ఏర్పాటు చేసుకున్న బస్టాండ్ మాత్రం నిర్మానుష్యంగా ఉంటుంది.

కేంద్రీకృత బస్టాండుతోనే పరిష్కారం

పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు నాలుగు బస్టాండ్లను ఒకే చోట కేంద్రీకృతం చేయాల్సిన అవసరం ఉంది. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో నాలుగు చోట్ల ఉన్న బస్టాండ్లను ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వద్దకు కేంద్రీకృతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు చొరవచూపి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలు ఏ మాత్రం ఉండవు. బస్టాండ్ నిర్మించి 15 ఏళ్లు అవుతున్నా బస్సులు మాత్రం అక్కడి నుంచి తిప్పడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు కేంద్ర బిందువుగా ఉండే బస్టాండ్ ఏమాత్రం లేదు. నాలుగుచోట్ల బస్టాండ్లు ఉండడంతో నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి.



బోసిపోయిన ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్

ట్రాఫిక్‌కు అంతరాయం

దేవదాయ శాఖకు చెందిన మైదానంలో ఏర్పాటు చేసిన బస్టాండ్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉంది. పట్టణ నడిబొడ్డులో ఉండడంతో వాహన రాకపోకలు అధికంగా ఉంటాయి. దీనికి తోడు కూరగాయల మార్కెట్, ప్రభుత్వ వైద్యశాల, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, బాలికల కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దీంతో జనసంచారం విపరీతంగా ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల దాకా విపరీతమైన రద్దీ ఉంటుంది. బస్సులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు ఒకే సమయంలో రాకపోకలు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు గంటల వ్యవధిలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయి శబ్ధ, వాయుకాలుష్యం విపరీతంగా వెదజల్లుతోంది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండడం లేదు. నాలుగు బస్టాండ్ల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు పక్కనే బస్టాండ్లు

మొలకాల్మూరు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన ఒక బస్టాండ్ ఉండగా.. బళ్లారి వైపు వెళ్లే దారిలో ఇంకో బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్లకు మధ్యలో వినాయక సర్కిల్ ఉంది. రెండు వాహనాలు తిరిగే మార్గం కావడంతో ఒక వైపు ఒక్కసారిగా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు కర్ణాటక బస్సులు కూడా రోడ్డులో నిలబడుతున్నాయి. వీటి నుంచి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతుంది. బస్సుల కోసం రోడ్ల మీదే తాత్కాలిక బస్టాండ్లు ఉండడంతో ఆ బస్సులన్నీ వినాయక సర్కిల్ వద్ద తిప్పుకుంటాయి. ఒక దాని వెనుక ఒకటి వెళ్లి తిప్పుకుంటుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వాహనాలు ఢీ కొనడంతో సర్కిల్ మధ్యలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం ధ్వంసమయింది. చిన్నపాటి ప్రమాదాలు చాలా జరిగాయి. ఆటోల రాకపోకల వల్ల కూడా తాత్కాలిక బస్టాండ్ల వద్ద తీవ్ర అసౌకర్యంగా మారింది.

ప్రపంచ దృష్టిని జిల్లా వైపు తిప్పుతాం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లావైపు ప్రపంచ దృష్టిని తిప్పితామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా జిల్లాను మారుస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఏపీఎంఐపీ (సూక్ష్మ సాగు నీటి పథకం) కింద 290 మంది రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో లక్ష ఎకరాల్లో సూక్ష్మ సాగునీటి పథకం లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఉమ్మడి జిల్లాలో 34వేల హెక్టార్లకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లర్లను ఇచ్చారన్నారు. ఆర్థిక విధ్వంసం జరిగిన రాష్ట్రంలో సంక్షేమపథకాలను అమలు చేయడం మాత్రం పక్కా అని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహాయంతో పోలవరం, అమరావతి, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా రైతుల తలరాతలు మారాలంటే హంద్రీనీవాతోనే సాధ్యమన్నారు. పోలవరం నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు నీళ్లను అనుసంధానం చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 80వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 40వేల హెక్టార్లకు మాత్రమే ఇచ్చారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దావోస్ పర్యటన ద్వారా సీఎం రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కృషి చేశారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,500హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటికే 10,313హెక్టార్లకు మంజూరు చేశామన్నారు. సూక్ష్మ సాగు నీటి పథకంలో దేశంలో జిల్లాను మూడవ స్థానంలో నిలిచేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. వచ్చేనెల 5న హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లాకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీరఘునాథరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ ఫిరోజ్‌ఖాన్, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు, రామాంజినేయులు, మారెన్న, తిమ్మప్ప, ప్యారం కేశవానంద, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.



డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న పయ్యావుల కేశవ్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్

హరిహరుల క్షేత్రం... అశ్వత్థం

- ఆదివారం నుంచి తిరుణాల
- ప్రతి ఏటా మఘమాసంలో ప్రారంభం
- తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తుల రాక
- తాడిపత్రి, అనంతపురం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు



అశ్వత్థనారాయణస్వామి, శింగరభట్టు మహర్షి మూలవిరాట్



శ్రీచక్ర భీమలింగేశ్వరస్వామి

పెద్దపప్పూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీ చక్ర స్థాపిత భీమలింగేశ్వరస్వామివారి తిరుణాల ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఏటా మాఘమాసంలో స్వామివారి తిరుణాలను వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. తాడిపత్రి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రముఖ పుణ్యక్షేత్రం పెన్నా నది ఒడ్డున ఉంది.

స్థల పురాణం

పూర్వం కంచి నుంచి శింగరభట్టు అనే మునీశ్వరుడు శంఖం, చక్రం, గద, అభయహస్తంతో కూడిన శ్రీ విష్ణుమూర్తి దర్శనార్థం ఇక్కడకు వచ్చాడని స్థలపురాణం చెబుతోంది. ఆ మహరుషి వరదరాజులస్వామిని ప్రసన్నం చేసుకొనేందుకు 12సంవత్సరాలు స్వామివారికి సేవ చేశారు. ఇదే సమయంలో రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు ఈ క్షేత్రానికి సమీపంలో ఉన్న పెద్దపప్పూరు రామకోటిలో నివసించేవాడని స్థలపురాణం చెబుతోంది. రావణుడు బ్రాహ్మణుడు కావడంతో బ్రాహ్మణ హత్యా పాతకమును భరించలేని శ్రీరాముడు అశ్వత్థ క్షేత్రంలో ఉన్న శింగరభట్టును కలిసి జరిగిన విషయాన్ని తెలిపారు. దీనికిగాను శింగరభట్టు మహర్షి నీ పాపమును నేను స్వీకరిస్తాను అని చెప్పాడు. తదనంతరం లక్ష్మీ సమేత విష్ణుమూర్తి ప్రసన్నం కోసం తపస్సు చేశాడు. మహరుషి శింగరభట్టుకు స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారు ఇక్కడ స్నానం ఆచరించిన భక్తులకు బ్రాహ్మణహత్యాపాతకము ఉండదని, రావి, వేపచెట్టు చుట్టూ తిరిగి ప్రత్యేక పూజలు చేసిన వారికి కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పాడు. అనంతరం నదిలో విగ్రహ రూపంలో దర్శనమిస్తానని స్వామివారు శింగరభట్టుకు తెలియజేశారు. నీవు కూడా విగ్రహ రూపంలో నా పక్కనే కొలువు ఉంటావని, నీ తర్వాతే భక్తులు నన్ను దర్శించుకుంటారని చెప్పి అంతర్ధానమయ్యారని పురాణం చెబుతోంది.

వేములవాడ భీమకవి ప్రతిష్ఠించిన భీమలింగేశ్వరుడు

శ్రీ అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలోనే స్వామివారికి అభిముఖంగా శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వరున్ని వేములవాడ భీమకవి ప్రతిష్ఠించాడు. ముందుగా స్వామివారి లింగం కిందిభాగాన శ్రీ చక్రాన్ని జగద్గురు ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించారని ప్రతీతి. ఎక్కడాలేనివిధంగా శివుని దర్శనం కోసం వచ్చిన భక్తులకు విష్ణుమూర్తి దర్శనం కావడం, విష్ణుమూర్తి దర్శనం కోసం వచ్చిన భక్తులకు శివయ్య దర్శనం కావడం ఇక్కడ ఆలయ విశేషం. దీంతో ఆలయాన్ని హరిహరుల వెలసిన క్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది.

ప్రతి ఏటా మాఘమాసంలో తిరుణాల

ప్రతి ఏటా ఫిబ్రవరిలో వచ్చే మాఘమాసంలో అశ్వత్థం తిరుణాల వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా అశ్వత్థ నారాయణస్వామి సన్నిధిలోని అశ్వత్థ కట్ట వద్ద వెలసిన నారాయణుడికి, శింగరభట్టు మహర్షికి, వినాయకుడికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. అనంతరం అభిముఖంగా వెలసిన భీమలింగేశ్వరున్ని భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఏడాది నాలుగువారాలపాటు తిరుణాల జరగనుంది. మూడో వారంలో భక్తులు వేలాదిగా తరలివస్తారు.

ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు..

ఎంతో ప్రసిద్ధిగాంచిన అశ్వత్థ క్షేత్రానికి రెండు తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. స్వామివారు కోరిన కోర్కెలు తీరుస్తారని ఇక్కడి నదిలో పుణ్యస్నాం చేసి స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఆలయానికి చేరుకోవడానికి తాడిపత్రి, అనంతపురం నుంచి ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. మహిళా భక్తులకు స్నానమాచరించేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటుచేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

చీనీకి పొలుసు పురుగు ముప్పు

ఉద్యాన శాఖాధికారి అమరేశ్వరి

తాడిమర్రి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చీనీ చోట్లకు పొలుసు పురుగు అధికంగా వ్యాప్తి చెందుతోందనీ, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి (హెచ్‌ఓ) అమరేశ్వరి సూచించారు. మండలంలోని శివంపల్లిలో గురువారం చీనీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ.. పొలుసు పురుగు ఉధృతి కారణంగా చీనీ చెట్లు చనిపోతున్నాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ పురుగు వ్యాప్తిని ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. 5 ఎం.ఎల్. షాంపూని లీటరు నీటికి కలిపి చెట్టు బాగా తడిసేలా పిచికారీ చేయాలన్నారు. ఆ తరువాత రోజు వేపనూనె, సిఫ్రోనిల్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఐదో రోజు స్పైరో టెట్రమాట్ 0.8 ఎం.ఎల్. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పొలుసు పురుగు వ్యాప్తి చెందకుండా చీనీ చెట్టు కాండానికి మైలుతుత్తి, సున్నం కలిపి పూత పూయాలన్నారు. వేసవిలో చీనీ చెట్లు చనిపోకుండా, వేరుకుళ్లు సోకకుండా వందలీటర్ల నీటికి కిలో యూరియా కలిపి పిచికారీ చేయాలని ఆమె వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమాదేవి, రైతు సేవా కేంద్రం అధికారులు గౌతమి, అజయ్, నిజాముద్దీన్, రైతులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు శాప్ చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఫిబ్రవరి 1న జిల్లాకు రానున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఫిబ్రవరి 2న ఉదయం క్రీడాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వీ-రన్‌లో ఆయన పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం ఆర్డీటీ స్టేడియంను సందర్శించి, 3న ఉదయం అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియాన్ని పరిశీలిస్తారు. అనంతరం క్రీడాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం తిరుపతికి వెళ్తారని డీఎస్‌డీఓ పేర్కొన్నారు.

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు తెలిపారు. నవంబరు, డిసెంబరులో తృతీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా నాల్గవ సెమిస్టర్(ఆర్21) విద్యార్థులకు రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మంత్రి కొల్లు పర్యటన వాయిదా

అనంతపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా పర్యటన వాయిదా పడింది. శుక్రవారం అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నూతన మద్యం పాలసీలో భాగంగా నవోదయం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సి ఉంది. అనంతరం సోములదొడ్డి సమీపంలో ఐఎంఎల్ డిపోను ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే శుక్రవారం సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం ఉండటంతో జిల్లా పర్యటనను రద్దు చేసుకున్నారు. తదుపరి పర్యటన తేదీని త్వరలోనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ఆంధ్ర-14 జట్టులో ముగ్గురికి చోటు



ఎంపికైన రోహిత్, లిఖిత్, ఆదినారాయణరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-14 రాష్ట్ర బాలుర జట్టులో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులకు చోటు దక్కింది. జిల్లాకు చెందిన రోహిత్, లిఖిత్, ఆదినారాయణరెడ్డి జట్టుకు ఎంపికయ్యారు.

తృటిలో తప్పించుకున్నాం..!



కుంభమేళాలో పామిడి పట్టణవాసులు



కుంభమేళాలో నాగ సాధువుతో పామిడివాసి జగదీష్ రావు (వృత్తంలో..)

రద్దీ ఎక్కువై తోసుకోవడమే ప్రమాదానికి కారణం

కుంభమేళా తొక్కిసలాటపై ఉమ్మడి జిల్లా భక్తులు

అనంతపురం కల్చరల్/పామిడి/పెనుకొండ టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఉమ్మడి జిల్లా నుంచి పలువురు భక్తులు వెళ్లారు. తొక్కిసలాట జరిగిన రోజున అదే ప్రాంతంలో ఉన్నా.. అందరూ క్షేమంగా బయటపడ్డారు. పామిడి నుంచి పలువురు భక్తులు వెళ్లారు. తొక్కిసలాట జరిగిన రోజే, అదే ప్రాంతంలో పుణ్యస్నానాలు చేశారు. కానీ మధ్యాహ్నం వెళ్లినందున తమకు ఆ విషయం తరువాత తెలిసిందని, ఆందోళనకు గురయ్యామని అన్నారు. 'మౌని అమావాస్య కావడంతో ఈనెల 29న కోట్లలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చారు. నదిలోని 3, 21, 22 సెక్టార్ల వద్ద తొక్కిసలాట జరిగింది. మేము 22వ సెక్టార్‌లోనే స్నానాలు చేశాము. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకూ తొక్కిసలాట, గందరగోళం కొనసాగిందట. మేము మధ్యాహ్నం 1.40 గంటల ప్రాంతంలో స్నానాలు చేశాము. అప్పటికి మాకు తొక్కిసలాట గురించి తెలియదు. ఆ ప్రాంతం కాస్త ఖాళీగా కనిపించడంతో తేలికగానే స్నానాలు చేశాము. కానీ బయటకు వచ్చాక విషయం తెలిసింది. తొక్కిసలాట, మరణాల కారణంగా ఆ ప్రాంతం ఖాళీ అయ్యిందని అర్థమైంది. కాస్త భయం వేసింది..' అని పామిడికి చెందిన జగదీష్‌రావు అన్నారు. అక్కడ ఉష్ణోగ్రత కేవలం 8 డిగ్రీలు ఉందని, చలికి వణికిపోయామని అన్నారు. స్నానాలు ఎంతసేపైనా చేయవచ్చని, కాకపోతే చలి కారణంగా నీటిలో ఎక్కువ సేపు ఉండలేమని అన్నారు. అక్కడ సౌకర్యాలు బాగున్నాయని, తొక్కిసలాట మినహా మరుపురాని అనుభూతి కలిగిందని జగదీష్‌రావు అన్నారు.

ఆటోలో వెళ్లాల్సిందే..



ప్రయాజ్‌రాజ్‌కు ఆదివారం చేరుకున్నాము. ఘాట్‌కు 20 కి.మీ. దూరంలోనే వాహనాలను నిలిపివేస్తున్నారు. రూ.200 చెల్లించి ఆటోలో వెళ్లాల్సి వస్తోంది. లక్షలాది మంది భక్తులకు ఘాట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కానీ విడిది కోసం వేసిన టెంట్లు సరిగా లేవు. కాశీ, అయోధ్యలోనూ ఇదే పరిస్థితి ఉంది. **-యర్రజోడు రామాంజనేయులు, సోమందేపల్లి**

బయటకు రాగానే..



కుంభమేళాలో పాల్గొన్న అనంతపురం వాసులు

తొక్కిసలాట నుంచి అనంతవాసులు రామకృష్ణ, చెరకు శ్రీనివాసులు, దామోదర్, రామలింగ, బాబు, భార్గవ నారాయణ తృటిలో తప్పించుకున్నారు. వీరు ఈనెల 28న అనంతపురం నుంచి రైలులో బయలుదేరి ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. 2వ సెక్టార్‌లో నదీస్నానమాచరించి, 29వతేదీ రాత్రి 2 గంటల సమయంలో బయటకు వచ్చేశారు. రెండో సెక్టారు నుంచి తాము బయటకు వచ్చిన 15 నిమిషాల తర్వాత పక్కనే ఉన్న సెక్టార్‌లో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ కుంభమేళాకు చేరుకుని నదీస్నానమాచరించారు.

పటిష్టమైన ఏర్పాట్లు..



ప్రయాగ్‌రాజ్‌లో అక్కడి ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. అయినా తొక్కిసలాట జరగడం బాధాకరం. ఆ ప్రమాదం నుంచి మేము కొన్ని నిమిషాల వ్యవధిలో తప్పించుకున్నాం. మేము బయటకు వచ్చేశాక తొక్కిసలాట జరిగింది. **-రామకృష్ణ, అనంతపురం**

ప్రజల తప్పిదమే..



కుంభమేళాలోని అన్ని సెక్టార్లలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మౌని అమావాస్య కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఒకరినొకరు తోసుకోవడం వల్లే ప్రమాదం జరిగింది. తొక్కిసలాటకు ముందే ఘాట్ నుంచి బయటకు వచ్చేయడంతో మాకు ప్రమాదం తప్పింది. **-చెరకు శ్రీనివాసులు**

వెంటనే పంపుతున్నారు..



అరుణాచలేశ్వరుని దర్శనం తర్వాత ఈనెల 28న ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాము. 17వ సెక్టారులో స్నానం చేశాము. భక్తులను ఎక్కువసేపు ఉండనివ్వడం లేదు. మూడు మునకలు వేయగానే పోలీసులు బయటకు పం పేస్తున్నారు. మేము ఘాట్ నుంచి బయటకు రావడానికి ఆరున్నర గంటల సమయం పట్టిందంటే రద్దీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చును. మౌని అమావాస్య కారణంగా చాలామంది కుటుంబ సమేతంగా వచ్చేశారు. బారికేడ్లను తోసుకుంటూ రావడం వల్లే తొక్కిసలాట జరిగింది. రద్దీ సమయాల్లో కుటుంబాలతో రాకపోవడమే శ్రేయస్కరం. **-విజయసాయి కుమార్**

శిబిరానికి చలో.. చలో..



విహారయాత్రకు బయలుదేరిన టీడీపీ కౌన్సిలర్లు

పురంలో క్యాంపు రాజకీయం

విహార యాత్రకు టీడీపీ కౌన్సిలర్లు

వైసీపీ సభ్యులతో జిల్లా అధ్యక్షురాలి భేటీ

బలం లేకున్నా.. వైసీపీ ఆరాటం

వేడెక్కిన చైర్మన్ ఎన్నిక

హిందూపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి క్యాంపు రాజకీయం మొదలైంది. వచ్చేనెల 3న ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో రాజకీయం వేడెక్కింది. టీడీపీకి చెందిన మునిసిపల్ కౌన్సిలర్లు గురువారం విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. వైసీపీ కౌన్సిలర్లతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పురం ఇన్‌చార్జి సమావేశమయ్యారు. ఈ పరిస్థితుల్లో హిందూపురం మున్సిపల్ రాజకీయం రెండ్రోజులుగా వేడెక్కింది. పట్టణంలో ఎక్కడ చూసినా చైర్మన్ ఎన్నికపైనే చర్చ సాగుతోంది.

విహార యాత్రలో టీడీపీ కౌన్సిలర్లు

ఫిబ్రవరి 3న చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్లు విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే బాలకృష్ణ సూచన మేరకు టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 18 మంది కౌన్సిలర్లు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, టీడీపీ నాయకుడు నాగరాజు వెళ్లారు. వీరు ఒకేసారి విహారయాత్ర నుంచి వచ్చేనెల 3న చైర్మన్ ఎన్నిక సమయానికి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు.

వైసీపీ కౌన్సిలర్లతో జిల్లా అధ్యక్షురాలి భేటీ

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో గురువారం వైసీపీకి చెందిన కౌన్సిలర్లతో ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ సమావేశమయ్యారు. ఎన్నికరోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ్యులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. వైసీపీకి చెందిన సభ్యులు సమావేశంలో కొన్ని అనుమానాలు వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సమావేశానికి కొందరు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. ఇలా అయితే ఎన్నిక రోజుకు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన ఆ పార్టీ వర్గాల్లో నెలకొంది. చైర్మన్ ఎన్నికకు జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, పురం సమన్వయకర్త దీపిక తర్జన భర్జన చేసినట్లు తెలిసింది. తాత్కాలిక చైర్మన్‌గా ఉన్న బలరాంరెడ్డి చైర్మన్‌గా ఉండాలని అధిష్ఠానం సూచించినట్లు జిల్లా అధ్యక్షురాలు.. ఆయనకు తెలిపింది. ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎందుకంటే రెండు నెలల క్రితం నాలుగో వార్డు నుంచి గెలుపొందిన వైసీపీ కౌన్సిలర్ లక్ష్మిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఆమె అప్పట్లో కొంత ఖర్చు కూడా భరించారు. ఈ నేపథ్యంలో తనకే అవకాశం ఇవ్వాలని ఆమె గట్టిగా అడిగినట్లు తెలిసింది. తాత్కాలిక చైర్మన్ బలరాం రెడ్డి, ముద్దిరెడ్డిపల్లికి చెందిన కౌన్సిలర్ జయప్ప, నాలుగోవార్డు సభ్యురాలు లక్ష్మి భర్త సమావేశమయ్యారు. ఈ సందర్భంలో చైర్మన్ అభ్యర్థి కోసం తర్జన భర్జన పడినట్లు తెలిసింది.

బలం లేకున్నా.. ఆరాటం

హిందూపురం మున్సిపాలిటీలో 38మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో మెజార్టీ సభ్యులు టీడీపీవైపు ఉన్నారు. బుధవారం విహారయాత్రకు వెళ్లినవారిలో 18మంది సభ్యులున్నారు. మరో ముగ్గురు సొంత పనులతో వెళ్లలేకపోయారు. దీంతో టీడీపీ బలం 21కి చేరింది. 23 నుంచి 24 మంది సభ్యులు కూటమివైపు ఉన్నారు. ఇక, వైసీపీ బలం 17మాత్రమే ఉంటుంది. చైర్మన్‌ను ఎన్నుకోవాలంటే 21మంది సభ్యుల మద్దతు అవసరం. 17మంది సభ్యులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. బలరాంరెడ్డి ఖర్చు భరించి, చైర్మన్‌గా ఉండాలని ఒక వర్గం ప్రోత్సహించింది. చైర్మన్ అయినా ఏడాదిపాటే సీటులో ఉంటారనీ, అంత ఖర్చు భరించి చేయగలిగింది ఏమీ ఉండదనీ, అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీ తరఫున చైర్మన్‌గా ఉన్నా రోజూ అవమానపడాల్సిందే తప్ప.. అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉండదని భావించారు. దీంతో ఆయన చైర్మన్ పోటీకి ఉత్సాహం చూపలేదని సమాచారం. నాలుగో వార్డు సభ్యురాలు లక్ష్మిని పోటీలో నిలపాలని ముఖ్యనేతలు యోచిస్తున్నారు. ఒకవేళ ఖర్చు భరించినా చైర్‌పర్సన్ అవుతారన్న నమ్మకం ఆమెలో సన్నగిల్లింది. ఈ పరిస్థితుల్లో ఎవరు చైర్మన్ అవుతారో వేచిచూడాలి. అనూహ్య పరిణామాల మధ్య బలరాంరెడ్డినే బరిలో దించుతారని ఆ పార్టీ వర్గాలే చెప్పుకుంటున్నాయి. ఇది ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

జడ్పీలో జగడం..!



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

(5వ పేజీ తరువాయి)

జడ్పీ సర్వసభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. మొదట వైద్యంపై చర్చ ప్రారంభించారు.

గంటపాటు సాఫీగా..

బుక్కరాయసముద్రం జడ్పీటీసీ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీకి సైతం కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బులు వసూలు చేస్తున్నారనీ, వైద్య శాఖాధికారులు కట్టడి చేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్స్ బిల్లులు ఇవ్వలేమంటూ కొన్ని ఆస్పత్రుల వద్ద బోర్డులు పెడుతున్నారనీ, ఇది సరికాదన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ... నేటికీ చాలా ఆస్పత్రుల్లో గత ప్రభుత్వ నేతల ఫొటోలు పెట్టారనీ, ప్రభుత్వం మారినా.. తొలగించకుంటే ఎలాఅంటూ అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ... కొందరు ఆర్ఎంపీలు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనీ, వారిపై పర్యవేక్షణ కొరవడిందన్నారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి మాట్లాడుతూ.. 108 వాహనాలు ఎన్ని పని చేస్తున్నాయో.. లెక్కలు తియ్యండని వైద్యశాఖాధికారులను ప్రశ్నించారు. ఇంతలో ఎమ్మెల్యే రాజు కలుగజేసుకుని మడకశిర ప్రాంతో 5 ఉంటే... ఒకటి మాత్రమే పనిచేస్తోందనీ, ఫోన్లు చేస్తే ఎత్తరనీ, ప్రజల ప్రాణాలు పోయేలా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. తర్వాత అనంతపురం, లేపాక్షి, వజ్రకరూరు జడ్పీటీసీలతోపాటు, బెలుగుప్ప ఎంపీపీ తమ ప్రాంతంలోని వైద్య సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.

వైసీపీ విమర్శలపై మంత్రి, ఎమ్మెల్యేల ఫైర్

సభలో మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కొత్తగా 'వాట్సాప్ పాలన' ద్వారా 161 సేవలు ప్రజలకు అందించేలా దేశంలోనే తొలిసారి తీసుకొచ్చిందనీ, ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ సభలో తీర్మానం చేయాలని కోరారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ బీకే పార్థసారధి ఆ తీర్మానాన్ని బలపరుస్తున్నామని ప్రకటించారు. ఇంతలో యల్లనూరు జడ్పీటీసీ బోగాతి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ప్రభుత్వం మాట తప్పిందంటూ విమర్శలు గుప్పించారు. దీంతో ఒక్కసారిగా టీడీపీ ఎమ్మెల్యేలు పైకి లేచి ఫైర్ అయ్యారు. 'అభివృద్ధిపై మీరా మాట్లాడేది...సిగ్గు పడాలంటూ...' ఎమ్మెల్యే రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క జడ్పీటీసీ కూడా ఈ ఐదేళ్లలో తమ మండలాల్లో కిలోమీటరైనా రోడ్డు వేయించుకున్నారా అంటూ మండిపడ్డారు. ఎంపీ పార్థసారధి మాట్లాడుతూ... వైసీపీ పాలనపై ఇక్కడ అందరికీ తెలుసన్నారు. పంచాయతీలు, జడ్పీలను నిర్వీర్యం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సవిత మాట్లాతూ... జగన్ పాలనను దేశం మొత్తం చూసిందన్నారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే.. కూటమి ప్రభుత్వం వాటిని చెల్లిస్తోందన్నారు. రూ.4 వేలు పింఛన్ ఇచ్చామనీ, ఇతర పథకాలు అమలుచేస్తున్నామన్నారు. వైసీపీ జడ్పీటీసీలు గొడవ చేయడం మానాలంటూ హెచ్చరించారు. ఈ క్రమంలో అరగంటపాటు అధికార పక్ష ఎమ్మెల్యేలు, వైసీపీ జడ్పీటీసీల మధ్య మాటల యుద్ధం సాగింది. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ.. వైసీపీ సభ్యులను రెచ్చగొడుతూ.. సభలోనూ తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఎమ్మెల్యేలు, మంత్రి ఫైర్ అయ్యారు. తర్వాత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా చర్చలు సాగాలన్నారు. జగన్ గవర్నమెంట్ ఏం చేసిందో ప్రజలు తెలుసుకునే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. 'రాజకీయాలు మాట్లాడేందుకు ఇది వేదిక కాదనీ, తర్వాత ఓ రోజు పెట్టుకుందాం.. రండి' అంటూ సవాల్ విసిరారు. నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వాలని జడ్పీటీసీలకు ఆయన సూచించారు. తర్వాత వ్యవసాయం, ఇరిగేషన్ తదితర అంశాలపై చర్చకు జడ్పీ చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు.

నిధులపై నిప్పులు

సభలో ఆత్మకూరు ఎంపీపీ, కదిరి జడ్పీటీసీలు తమకు కేటాయించిన పనులు చెయ్యనివ్వలేదంటూ మాట్లాడారు. దీంతో అగళి జడ్పీటీసీ ఉమేష్ మైక్ అందుకుని, ఈ ఐదేళ్లలో అగళి మండలాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారంటూ భగ్గుమన్నారు. ఇంతలో వైసీపీ జడ్పీటీసీలు 10 మంది వరకూ ఆయనపై మాటల దాడికి దిగారు. 'నువ్వు మాట్లాడకూడదు.. కూర్చో' అంటూ హెచ్చరించడంతో ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, రాజు ఒక్కసారిగా లేచి వచ్చి... వైసీపీ జడ్పీటీసీలను ఎదుర్కొన్నారు. 'మీరెవరయ్యా... కూర్చోమనడానికి.. మీకేం హక్కుంది?' అంటూ హెచ్చరించారు. ఇంతలో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ మంగమ్మ, వైసీపీ జడ్పీటీసీలు అంతా ఒకవైపు... టీడీపీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు మరో వైపుగా కదిలి... పోడియం వద్ద ఘర్షణకు దిగారు. 40 నిముషాల పాటు సభలో ఒకటే గందరగోళం. మరో వైపు వేదికపై మంత్రి సవిత, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సైతం వాగ్వాదం చేసుకుంటూ కనిపించారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్, అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ మౌనం వహించారు. సభను సమన్వయం చేయడంలో జోక్యం చేసుకోలేకపోయారు. 40 నిముషాలపాటు సభలో రెండువర్గాల సభ్యుల మధ్య వాగ్యుద్ధం సాగింది. అన్నిశాఖల అధికారులు మౌనప్రేక్షకులుగా మారారు. మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కలుగజేసుకుని వైసీపీ అరాచకాలు సాగవన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల్లో ఏమాత్రం అభివృద్ధి సాగింతో అందరికీ తెలుసన్నారు. రాజకీయాలు మాట్లాడకుండా కూటమి పాలనలో అభివృద్ధికి సహకరించాలని సూచించారు. తర్వాత పంచాయతీ రాజ్ ఇతర అంశాలపై అరకొరగానే చర్చలు సాగించి మధ్యలోనే ముగించారు. కార్యక్రమంలో సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర అధికారులు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

8 నెలల్లో చాలానే చేశాం: సవిత, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి

కూటమి పాలనలో ఎనిమిది నెలల్లో చాలానే చేశాం. వైసీపీ హయాంలో ఆగిపోయిన అమరావతిని పట్టాలెక్కించాం. పోలవరం పనులు కూడా మొదలుపెట్టాం. మాట ఇచ్చినట్లుగానే సీఎం చంద్రబాబు వృద్ధులకు పింఛన్ సొమ్ము రూ.4వేలు ఇస్తున్నాం. గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేస్తున్నాం. ఇవన్నీ చూసైనా... వైసీపీ సభ్యులు రాజకీయాలు మాట్లాడటం మాని, కూటమి పాలనకు సహకరించాలి.

పంచాయతీలను నాశనం చేశారు - బీకే పార్థసారధి, హిందూపురం ఎంపీ



వైసీపీ పాలనలో పంచాతీయలను నాశనం చేశారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జడ్పీలను నిర్వీర్యం చేశారు. 2019-2024 మధ్య వచ్చిన నిధులు మళ్లించారు. రాజకీయలే మాట్లాడాలనుకుంటే.. ఒక్కో అంశంతో రండి. మీ అభివృద్ధి ఏంటో చూపిస్తాం. అభివృద్ధి గురించి మాట్లాడండి. 15వ ఆర్థిక సంఘం, 8 పర్ క్యాపిటా బడ్జెట్, ఇతర నిధులపై కలెక్టర్ల సమక్షంలో సమీక్ష చేయండి. త్వరలో వేసవి వస్తోంది. జడ్పీ, డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయం చేసుకుని, తాగునీటి సమస్య లేకుండా చూడండి.

అభివృద్ధి టీడీపీ విధానం... అడ్డుకునేది వైసీపీ సంస్కృతి.. - దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం ఎమ్మెల్యే



అభివృద్ధి టీడీపీ విధానం.. పనులు అడ్డుకునేది గత వైసీపీ ప్రభుత్వ సంస్కృతి. గత ఐదేళ్లలో అభివృద్ధి ఏం జరిగిందో అందరికీ తెలుసు. కూటమి పాలనలో అభివృద్ధి వేగవంతమైంది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలు సులభంగా అందనున్నాయి. రాజకీయం చేయడం మాని, అభివృద్ధి కోసం చర్చించండి. రుద్రంపేట పంచాయతీలో గత వైసీపీ పాలనలో రూ.36 లక్షల అవినీతి తేలింది. సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. ఆ డబ్బును వెంటనే రికవరీ చేయండి.

సర్పంచ్‌లకు మహర్దశ: కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే



గత వైసీపీ పాలనలో పంచాయతీల్లో ఏమాత్రం అభివృద్ధి చేశారో మీకే తెలుసు. అర్ధరాత్రి పూట పంచాయతీల ఖాతాలను సైతం ఖాళీ చేశారు. కూటమి ప్రభుత్వంలో సర్పంచ్‌లకు మహర్దశ పట్టింది. మంచి రోజులొచ్చాయని వైసీపీ సర్పంచ్‌లు మా వద్దకొచ్చి చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు చెప్పాలి.

వైసీపీ సభ్యులు సిగ్గుపడాలి: ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర



గత ఐదేళ్లలో జిల్లా నీటిని పుంగనూరుకు తరలించారు. పంచాయతీలకు నిధుల్లేవు. జడ్పీటీసీలు కనీసం కిలోమీటరు కూడా రోడ్డు వేయించుకోలేదు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలను విమర్శించడం సిగ్గుచేటు. అభివృద్ధిపై మాట్లాడే అర్హత వైసీపీ సభ్యులకు లేదు. చేతకాని సభ్యులు, జడ్పీ చైర్‌పర్సన్ సభను గొడవలు చేస్తూ... తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆఖరికి మైక్‌లు కూడా పనిచేయకుండా చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకు రూ.42.86 కోట్లతో 2004 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో స్థిరనివాసం కలిగిన బీసీలు, ఏబీసీడీఈ కేటగిరీలు, ఈబీసీ కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి వర్గాలవారు ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పథకాలకు సంబంధించి 21నుంచి 60 ఏళ్ల లోపు వయసు కలిగి, కుల, వయసు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతాతో ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు

సెస్సు వసూళ్లలో కర్నూలు టాప్

- సీమలోని 74 మార్కెట్ కమిటీలకు రూ. 133.16 కోట్ల సెస్సు వసూలు లక్ష్యం
- జేడీ రామాంజనేయులు



మాట్లాడుతున్న జేడీ

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మార్కెట్ సెస్సు వసూలు రాయలసీమలో మొదటి స్థానంలో ఉందని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో మార్కెట్ ఫీజు వసూళ్లపై వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో రూ.35.14 కోట్ల సెస్సు లక్ష్యానికి గాను ఇప్పటికే రూ.26.18 కోట్ల సెస్సు వసూలైందని అన్నారు. రెండో స్థానంలో నంద్యాల జిల్లా ఉందని, ఈ జిల్లాలో రూ.25.05 కోట్ల లక్ష్యానికి గాను రూ.15.42కోట్లు వసూలైందని జేడీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల పంటల దిగుబడి బాగా ఉందని, కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరలు అందుతున్నాయని అన్నారు. అందువల్ల మార్కెటింగ్ ఫీజు కూడా లక్ష్యానికి మించి వసూలవుతున్నదని అన్నారు. అనంతపురం జిల్లాలో రూ.12 కోట్ల సెస్సు వసూలుకు గాను రూ.7.75 కోట్లు ఇప్పటికి వసూలైందని అన్నారు. చిత్తూరు జిల్లాలో రూ.10.49 కోట్లకుగాను రూ.5.83 కోట్లు, కడప జిల్లాలో రూ.12.50 కోట్లకుగాను రూ.7.8 కోట్లు, తిరుపతి జిల్లాలో రూ.23.24 కోట్లకుగాను రూ.12.41 కోట్లు, అన్నమయ్య జిల్లాలో రూ.8.37 కోట్లకు గాను రూ.7.15 కోట్లు వసూలయ్యాయని అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.5.31 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.59 కోట్ల మేర సెస్సు వసూలైందని అన్నారు. రాయలసీమలోని 74 మార్కెట్ కమిటీల నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.133.16 కోట్ల సెస్సును వసూలు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించామని, డిసెంబరు నెలాఖరుకు రూ.87.20 కోట్లు వసూలైందని అన్నారు. ఈ సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. పంట ఉత్పత్తుల కొనుగోలు చేస్తున్న వ్యాపారుల నుంచి సక్రమంగా మార్కెట్ ఫీజు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీల సెక్రటరీలను ఆదేశించామని అన్నారు. చెక్‌పోస్టుల ద్వారా జీరో వ్యాపారాన్ని అరికట్టి పూర్తి స్థాయిలో సెస్సును వసూలు చేయాల్సిందిగా మార్కెట్ కమిటీల సెక్రటరీలకు ఆదేశాలిచ్చామన్నారు. త్వరలోనే కోడుమూరు మార్కెట్ కమిటీ యార్డును ప్రారంభిస్తామని అన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో కేంద్రం నిధులతో కోల్డ్ స్టోరేజీ ప్లాంటును నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

న్యూస్ బాక్స్

నేడు సీసీ రోడ్డుకు భూమి పూజ

● ఎంపీ, ఎమ్మెల్యే హాజరు

రాప్తాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో మౌనగిరి హనుమాన్ క్షేత్రం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథులుగా హాజరవుతారని పీఆర్ ఏఈ కిషోర్‌కుమార్ గురువారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. రూ. 20 లక్షలు ఎంపీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఎంపీ, ఎమ్మెల్యే భూమి పూజ చేసి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

క్యాన్సర్ చికిత్సకు రూ.7 లక్షల సాయం

అనంతపురం సెంట్రల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాధితిరాలికి ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ అసిస్టెంట్ సెక్రెటరీ జారీచేసిన లేఖను గురువారం బాధితురాలికి బీజేపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌తో కలిసి మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు వివరాలను గురువారం వెల్లడించారు. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన ఓ మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోందన్నారు. వైద్యఖర్చుల కోసం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతీసుకుని సీఎంఆర్ఎఫ్‌కు సిఫార్సు చేశారన్నారు. హైదరాబాద్‌లోని బసవతారక క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యం చేయించేందుకు రూ.7లక్షల నిధులను చెల్లిస్తామని ముఖ్యమంత్రి కార్యాలయంనుంచి లెటర్ వచ్చిందని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి సీఎంఆర్ఎఫ్ లేఖను అందజేసినట్లు పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించాలి : ఎంవీఐ

అనంతపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడపాలని ఎంవీఐ డి. శ్రీనివాసులు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ బాలికల కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఎంవీఐ రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన పద్ధతులను తెలుసుకొని, ఇతరులకు చెప్పడంతోపాటు ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటన బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటనలో తీవ్రంగా గాయపడిన కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన బాధితురాలు శ్రీదేవికి మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు చైర్మన్ ఎంఎస్‌రాజు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన గురువారం అనంతపురంలోని తన నివాసంలో బాధితురాలికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, టీటీడీ పాలక మండలికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విచారణ కమిటీలో జేసీని తొలగించాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కమిషన్ సమావేశంలో ఆర్డీఓ మలోల రమ్మీ జూదమాడిన అంశంపై విచారణ కమిటీలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మను తొలగించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చేదుకు సాకేహరి వచ్చారు. గమనించిన పోలీసులు అధికారులు ఆయన్ను అడ్డగించి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సాకేహరి మాట్లాడుతూ... విచారణ కమిటీ సభ్యుడైన జేసీ ఆర్డీఓను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని, తక్షణమే సభ్యునిగా జేసీని తొలగించి పారదర్శకంగా విచారణ చేపట్టాలని కోరారు.

డిప్లొమాతో ఉజ్వల భవిష్యత్తు

● జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు

అనంతపురం రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు డిప్లొమా విద్య బలమైన అడుగుగా నిలుస్తుందని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు పేర్కొన్నారు. స్థానిక పీవీకేకే డిప్లొమా కళాశాలలో గురువారం స్వాధ్యాయ-2025 పేరుతో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ మాట్లాడుతూ..ప్రతి ఏటా సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండురోజుల పాటు జరుగుతుందన్నారు. ఈసారి 155 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయన్నారు. తొలిరోజు వివిధ పాఠశాల నుంచి దాదాపు మూవేల మందికిపైగా ప్రాజెక్టుల వీక్షణకు రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసులురెడ్డి, డీన్ సంతోష్‌రెడ్డి, పివికేకే ఐటి ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, అనురాగ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

అనంతపురం అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గానికి చెందిన టీడీపీ వడ్డెర సాధికార సమితి నాయకుడు వన్నూరు అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకుడు కురబ నారాయణస్వామి గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

స్త్రీనిధి రికవరీలో సౌజన్య ప్రతిభ



సౌజన్యను అభినందిస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాల చెల్లింపులు, రికవరీలో యానిమేటర్ సౌజన్య రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. తాడిపత్రి మండలం చౌడేశ్వరి గ్రామ సంఘం యానిమేటర్ సౌజన్య స్త్రీనిధి రుణాల చెల్లింపులు, రికవరీలో మొదటి స్థానంలో నిలవడంతో బుధవారం రాజధాని అమరావతిలో నిర్వహించిన స్త్రీనిధి సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఎండీ హరిప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దీంతో గురువారం సాయంత్రం స్థానిక డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తన చాంబర్‌లో ఆమెకు ప్రత్యేక బహుమతి అందజేసి అభినందించారు. స్త్రీనిధి ఏజీఎం హనుమేష్‌బాబు, తాడిపత్రి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ వీరాస్వామి, మేనేజర్ నాగార్జున, సీసీ భాషా తదితరులు పాల్గొన్నారు.

కంది రైతుల గగ్గోలు

● నిబంధనలతో నష్టపోతున్నామని ఆవేదన

● గిట్టుబాటు ధర పెంచాలని వేడుకోలు



కొనుగోలు కేంద్రంలో కందులను తూకం వేస్తున్న దృశ్యం

గార్లదిన్నె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల వల్ల కొన్నేళ్లుగా మండల రైతులు వేరుశనగ పంట సాగుచేసి నష్టాల పాలయ్యా రు. దీంతో ఈ సంవత్సరం చాలామంది కంది సాగుపై ఆసక్తి చూపారు. రైతు శ్రమకు తగ్గట్టుగా పంట బాగా పండింది. అయితే అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా కంది రైతుల పరిస్థితి నెలకొంది. పంట దిగుబడి బాగా వచ్చిందని ఆనందించేలోగా మార్కెట్‌లో ధర లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బయట మా ర్కెట్ కన్నా రూ. వెయ్యి ఆదనంతో కందుల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. కానీ కందుల కొనుగోలులో ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులను నష్టాల పాలుచేస్తున్నాయి. ఎకరాకు రెండున్న క్వింటాలు మాత్రమే కొనుగో లు చేస్తామన్న నిబంధన తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని రైతులు వాపోతు న్నారు. మండలంలోని గార్లదిన్నె, కనుంపల్లి, మర్తాడు, కోటంక, పెనకచెర్ల తదితర గ్రామాల్లో మూడు వేల ఎకరాల్లో కంది సాగుచేశారు. ఎకరాకు రూ. 15 వేలు నుంచి రూ. 20వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే నెల కిందట క్వింటా రూ. 9వేలు వరకు ఉన్న ధర, దిగుబడి వచ్చే సమయానికి రూ. 6వేలకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ. 7550తో కొనుగో లు చేస్తోంది. అయితే ఎకరాకు రెండున్నర క్వింటా మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడంతో పాటు, ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులవి మాత్రమే కొనుగోలు చేస్తామని మరో నిబంధన పెట్టారు. దీంతో ఏం చేయాలో తెలియక పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండున్నర క్వింటా కంటే ఎక్కువ దిగుబడి వచ్చిన రైతులు పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఇటీవల జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి నిబంధనలు లేకుండా రైతులతో పంట కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రతి యేటా నష్టాలే



పంటలు సాగుచేసిన ప్రతి సారి నష్టాలే చూస్తున్నాం. ఈ ఏడాది అధికంగా రైతులు కంది పంటను సాగు చేశారు. అయితే దిగుబడి వచ్చే సరికి ధర లేకపోవడం బాధాకరం. నేను ఎకరాలో కంది సాగుచేశాను. ఎకరాకు రూ. 25వేలు పెట్టుబడి అయితే రెండున్నర క్వింటా దిగుబడి వచ్చింది. బయట మార్కెట్‌లో క్వింటా రూ. 6వేలు ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో రూ. 7550 ఉంది. గిట్టుబాటు ధరను మరింత పెంచి రైతులను ఆదుకోవాలి.

- గోరకాటి వెంకటేష్, రైతు, మర్తాడు

పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువ



ప్రతి సారి లక్షలు పెట్టుబడులు పెట్టి రైతులు పంటలను సాగు చేస్తున్నారు. అంతంత మాత్రంగానే దిగుబడి వస్తోంది. నేను పదెకరాల్లో కంది సాగు చేశా. దిగుబడి మాత్రం 25 క్వింటాళ్లు వచ్చింది. దిగుబడి ఉంటే ధర ఉండదు...ధర ఉంటే దిగుబడి ఉండదు. దీంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. రైతులు సాగుచేసిన ప్రతి పంటకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- బాల నల్లపరెడ్డి, రైతు కనుంపల్లి

ఈ - క్రాప్ బుకింగ్ తప్పని సరి



ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో పంటను కొనుగోలు చేయాలంటే తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసి ఉండాలి. ఎకరాకు రెండున్నర క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తారు. పంటకోత ప్రయోగా లు చేసిన సమయంలో ఎకరాకు రెండు క్వింటాల కంటే ఎక్కువ దిగుబడి రాలేదు. దీంతో ప్రభుత్వం రెండున్నర క్వింటాలు మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన పెట్టారు.

- సోమశేఖర్, వ్యవసాయాధికారి, గార్లదిన్నె

ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు

ప్రభుత్వం పెట్టిన నిబంధనల ప్రకారమే కొనుగోలు కేంద్రాలలో కందులను కొనుగోలు చేస్తు న్నాం. ఎకరాకు రెండున్నర క్వింటాలు ప్రకారం కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం పెట్టిన నిబంధనల మేరకు నాణ్యత ఉంటేనే కొనుగోలు చేస్తాం. మూడు రోజుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటి వరకు సుమారు 150 క్వింటాళ్ల కొనుగోలు చేశాం.

- అమర్‌నాథ్‌రెడ్డి, సీఈఓ, రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం

చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

గార్లదిన్నె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్ర సాద్ యాదవ్ పేర్కొన్నారు. గార్లదిన్నెలోని రైతుసేవా కేంద్రంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్‌సే సమాధాన్ (మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీనియర్ న్యాయవాదులు హరికృష్ణ, పద్మజ, సీఐ కౌలుట్లయ్య, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబాఫకృద్దీన్, ఈఓఆర్డీ దామోదరమ్మ, మండల విద్యాశాఖాధికారి తారా చంద్రానాయక్, ఏపీఎం మల్లికార్జున, సీడీపీఓ ఉమాశంకరమ్మ, మహిళలు పాల్గొన్నారు.

20 రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి

● దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు

అనంతపురం కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్చకుల సమస్యలను 20 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో మొదటిరోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణ మండపంలో గురువారం అర్చకు సమస్యలపై సమావేశం నిర్వహించారు. దాదాపు 200 మంది అర్చకులు హాజరై తమ సమస్యలపై 133 ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ... ఇకనుంచి ప్రతి నెల రెండో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని, అర్చకులు తమ సమస్యలను తెలుప వచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి శివశంకర్, వుల్లమాచార్యులు, ద్వారకనాథాచార్యులు, బాలాజీ, గోపాల్, హనుమంత రాయుడు, మారుతి, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు. అయితే ఆదిశేషనాయుడు అనంతపురం జిల్లాలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అర్చకుల సమస్యలు పట్టించుకోవడం లేదంటూ ఈ నెల 22న జిల్లాకేంద్రంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య నాయకులు ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తమకు సమాచారమివ్వకుండా ఏపీ అర్చక సమాఖ్య నాయకులకు మాత్రమే సమావేశం సమాచారం ఇచ్చారని ఉమ్మడి జిల్లా సంఘానికి చెందిన అర్చకులు సహాయ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. కాగా ఫిబ్రవరి 4న ఆదిశేషనాయుడుపై అధికారులు చేపట్టే విచారణకు హాజరయ్యేందుకు సమాయత్తమవుతున్నారు.

పరిపాలనలో పారదర్శకత ఉండాలి

అనంతపురం కల్చరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పరిపాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనం పెరగాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మంచాల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సాయి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా సర్వసభ్య సమావేశానికి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథి గా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు విద్యార్థులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ఐక్యవేదిక నాయకులు ఎంబీవీ రమణారెడ్డి, పోట్ల రామప్ప, నిసార్ అహ్మద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహీం, జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, నాయకులు సాంబ శివుడు, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, టీవీ రెడ్డి, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

● పీహెచ్‌సీ వైద్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన



ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

అనంతపురం అర్బన్/ రాప్తాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందించే వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గురువారం రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని ఆత్మకూరు, కురుగుంట, రాప్తాడు, కనగానపల్లి, నాగసముద్రం గేట్, రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమావేశమయ్యారు. ఆస్పత్రుల నిర్వహణ, రోగులకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రుల్లో అవసరమైన వాటిపై వివరాలు అందిస్తే సమకూరుస్తామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను చిన్న వాటికి కూడా అనంతపురం పంపవద్దని, ఏదైనా ప్రమాదం అనిపిస్తేనే పెద్దాస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. వైద్యులు సమయ పాలన పాటించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీతకు వైద్యులు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కలసి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల మాట్లాడారు. ముఖ్యమంత్రిని కలసి నియోజకవర్గంలో రైతుల సాగు నీటిని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరిస్తూ, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి టీడీపీ నాయకుల సన్మానం

అనంతపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్‌ను పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. స్థానిక సుబాష్‌రోడ్డులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, టీడీపీ నాయకులు సిమెంట్ పోలన్న, సుధాకర్, సుబ్బరాయుడు, వెంకటరాముడు, బాషా, లక్ష్మన్న రాజేష్‌కు శాలువ కప్పి, పూల మాల వేసి సన్మానించారు.

రోగులకు నాణ్యమైన సేవలందిస్తాం

జిల్లా సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ



సమావేశంలో చర్చిస్తున్న కలెక్టరు, ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర సభ్యులు, డాక్టర్లు

అనంతపురం టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో 2003లో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆ తర్వాత ఇప్పుడు నూతన కమిటీతో తొలి సమావేశం గురువారం నిర్వహించారు. కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి నూతన కమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, విశాల ఫెర్రర్, రవికాంత్ రమణ, ఇతర సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధానంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వంటి అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఇంకా ఆసుపత్రిలో ఎలాంటి అభివృద్ధి చే యాలి అనే అంశంపై చర్చించారు. అందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రభుత్వం వైపు నుంచి తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలపైనా పలువురు ప్రస్తావించారు. త్వరలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్న క్యాంటిన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఆసుపత్రిలో రూ. 65 లక్షలతో ల్యా బ్, రూ. 35 లక్షలతో మొబైల్ క్లినిక్, ప్రభుత్వాసుపత్రిలో మదర్ బ్రెస్ట్ ఫీ డింగ్ వంటివి ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు, ఆర్ఎంఓ డాక్టరు రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ పలువిభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ప్రతినెలా జీతాల కోసం అడుక్కుతినాలా..?

● ఆస్పత్రి కమిటీ ఎదుట పారిశుధ్యకార్మికుల ఆవేదన

అనంతపురం టౌన్: సార్... ప్రతినెలా జీతాలకోసం అడక్కుతింటున్నాం, మీరైనా మాపై దయ ఉంచి జీతాలు సక్రమంగా ఇచ్చేలా చూడాలని ఆస్పత్రి అభివృద్ధికమిటీ ఎదుట ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌స్పెషాలిటీలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరుగుతుండగా పారిశుధ్య కార్మికులు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు కలెక్టరు, ఎమ్మెల్యేతో మాట్లాడుతూ... ఏజెన్సీ సరిగా జీతాలు ఇవ్వడంలేదని, తాము కట్టిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ జమచేయడం లేదని ఫిర్యాదు చేశారు. చాలా ఏళ్లగా ఇలా ఇబ్బందిపడుతున్నామని, తమ గోడును ఎవరికి చెప్పుకున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పుడు మీరైనా మాకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడు, కృష్ణుడు, చిరంజీవి, వెంకటేష్, నల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖలో సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యేకి తెలుగు నాడు వైద్య ఉద్యోగ సంఘం వినతి



ఎమ్మెల్యే దగ్గుపాటిని సన్మానిస్తున్న తెలుగు నాడు వైద్య ఉద్యోగులు

అనంతపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : వైద్య శాఖలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే దగ్గుపాటిని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున తదితరుల ఆధ్వర్యంలో శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం వైద్య శాఖలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి మురళీకష్ణ, కోశాధికారి శివయ్య, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, శివప్రసాద్, నాగశంకర్, కిరణ్‌కుమార్, హరికృష్ణ, లావణ్య, కుమారి బాయ్, నాగమణి పాల్గొన్నారు.

రాప్తాడు సర్పంచ్‌కు సన్మానం

రాప్తాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికై జనవరి 26న ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలును ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం సన్మానించారు. అనంతపురం నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత ఆయనను శాలువా, మొమెంటోతో అభినందించారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

జాతిపిత మహాత్మగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు గురువారం ఆర్యవైశ్య సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఘన నివాళులర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సమీపంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ నాయకులు సిమెంట్ పోల న్న, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్ తదితరులు నివాళులర్పించారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి ఆ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఇన్‌చార్జ్ కమిషనర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్లు విజయ భాస్కర్‌రెడ్డి, సాహిత్యతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి వైసీపీ శ్రేణులతో కలిసి గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కనగానపల్లిలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి గోవిందు పాఠకులు, విద్యార్థులతో కలసి గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళర్పించారు.

పొలంలో చీనీచెట్లు.. బిల్లులు మామిడికి..!

● ముగిసిన సామాజిక తనిఖీ ● నేడు ప్రజావేదిక

కనగానపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా వివిధ రకాల పనులు చేపట్టారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి దాదాపు రూ. 6కోట్లు ఉపాధి నిధులు ఖర్చుచేశారు. జరిగిన పనుల్లో అవినీతిని తేల్చడానికి గ్రామాల వారీగా డీఆర్‌పీలు వారం రోజులుగా తనిఖీలు చేపట్టారు. కనగానపల్లి లో గురువారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. శుక్రవారం ప్రజా బహిరంగ వేదికలో గ్రామాలవారీగా జరిగిన అవినీతిని డీఆర్‌పీలు వివరిస్తారని ఎస్ఆర్‌పీ చంద్ర మోహన్ తెలిపారు. ఉపాధి పథకం కింద మామిడిచెట్ల బిల్లులు మంజూరుకాగా, క్షేత్రస్థాయిలో మాత్రం రైతుల పొలాల్లో చీనీ చెట్లు ఉండడంపై డీఆర్‌పీలు అవాక్కవుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా 'నా భూమి - నా దేశం' కింద మామిళ్లపల్లిలో బోర్డులు ఉన్నా మొక్కలు లేవు. ఇలా గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి నిధుల దుర్వినియోగం జరిగినట్లు తెలిసింది. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చెప్పినట్లు ఇష్టానుసారంగా బిల్లులు చేసి ఇప్పుడు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో, అప్పటి అధికారుల్లో భయం నెలకొంది. దీంతో కొందురు డీఆర్‌పీలకు ఫార్మాలిటీస్ ఇచ్చి తమ అవినీతిని బయటకు రాకుండా చేశారని సమాచారం. ప్రజావేదికలో ఎంత అవినీతిని బయటపెడతారోనని అధికారుల్లో భయం నెలకొంది.

వెటరన్స్ క్రికెట్ పోటీలు ప్రారంభం

● ఏపీ, తమిళనాడు జట్ల శుభారంభం



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న వసంత శరవణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం నగర శివారులో ఉన్న ఆర్డీటీ స్టేడియంలో ఆర్‌వీకే మెమోరియల్ సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 17.4 ఓవర్లలో 96 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బరిలోకి దిగిన ఏపీ జట్టు 15.3 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 97 పరుగులు చేసింది. తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడు వికెట్లు తీసి, 27పరుగులు చేసిన ఏపీ ఆల్‌రౌండర్ షాబుద్దీన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. మరో మ్యాచ్‌లో తమిళనాడు, సర్వీసెస్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన తమిళనాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సర్వీసెస్ జట్టు 15.1 ఓవర్లలో కేవలం 41 పరుగులు మాత్రమే చేసి, తమిళనాడు బౌలర్లు వెంకట్ (3 వికెట్లు), సురేష్ బాబు (2 వికెట్లు) ధాటికి కుప్పకూలింది. దీంతో తమిళనాడు 152 పరుగుల తేడాతో గెలుపొందింది. తమిళనాడు జట్టులోని వసంత శరవణ 89 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ కార్యదర్శి సుధీర్ బాలచంద్రకులకర్ణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్ ఎంఎస్ కుమార్, అపెక్స్ మెంబర్ ప్రసన్నకుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, ఏసీఏ సౌత్ జోన్ మేనేజర్ సాగర్ చౌదరి, జిల్లా వెటరన్ క్రికెట్ డైరెక్టర్ నాగప్ప, అధ్యక్షుడు కృష్ణమోహన్, సెక్రటరీ మధుకర్, వెటరన్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫది మ్యాచ్ అందుకుంటున్న షాబుద్దీన్

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కోడిగుడ్లు సక్రమంగా అందిస్తున్నారా అని విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షల్లో బాగా చదివి ర్యాంకులు తెచ్చుకోవాలన్నారు. ఫస్ట్, సెకెండ్ ర్యాంకులు సాధించిన వారికి ఫ్లైట్ జర్నీ కల్పిస్తానని, సీఎం చంద్రబాబు దగ్గరకు కూడా తీసుకెళ్లి అభినందనలు చెప్పిస్తామని చెప్పారు. విద్యార్థులు మంత్రితో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు.

వాల్మీకి కల్యాణ మండపం పునర్నిర్మాణానికి నిధులివ్వండి

ఉరవకొండ పట్టణంలో 40ఏళ్ల కిందట నిర్మించిన వాల్మీకి కల్యాణ మండపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, పునర్నిర్మాణానికి నిధులు ఇవ్వాలని మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను వాల్మీకి సంఘం నాయకులు కోరారు. పట్టణంలో పర్యటించిన మంత్రిని, ఎంపీని వారు కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే చాయాపురం గ్రామస్థులు హంద్రీనీవాపై వంతెన నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరు చేయించినందుకు లత్తవరం రైతులు మంత్రిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీపతిరెడ్డి మృతికి డీఆర్వో, ఆర్డీఓల నివాళి

కూడేరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీపతిరెడ్డి గత బుధవారం బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి వద్ద ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన భౌతిక కాయాన్ని గురువారం స్వగ్రామమైన మండలంలోని గొట్కూరుకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు వచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

మట్కాబీటర్ అరెస్టు

తాడిపత్రి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడుకు చెందిన ఓ మట్కాబీటర్‌ను గురువారం అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.41వేలు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేసి అరెస్టు చేశామని, అలాగే కేసు నమోదుచేశామని చెప్పారు.

ఆరుగురిపై కేసు నమోదు

యాడికి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇంటివద్ద గోడ విషయంలో గొడవపడి దాడిచేసిన ఘటనలో రాయలచెరువు గ్రామానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదుచేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. రాయలచెరువు గ్రామానికి చెందిన రజక శేఖర్, రంగస్వామి ఇంటివద్ద గోడవిషయంలో గొడవపడ్డారు. ఈనెల 27న గోడ ఉన్న స్థలాన్ని అధికారులు సర్వే చేయడానికి వచ్చారు. ఆ సమయంలో ఇరువర్గీయుల మధ్య వాగ్వాదం జరిగి రజక శేఖర్, చిన్న సంజీవరాయుడులపై రంగస్వామితోపాటు మరో ఐదుగురు దాడిచేసి గాయపరిచారు. గాయపడ్డ రజక శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగస్వామి, మల్లికార్జున, మహేష్, నరసింహా, ఆర్య, సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

కుందుర్పి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేపాలెం గ్రామంలో గోసి మల్లయ్యకు చెందిన గడ్డివామి గురువారం అగ్నికి ఆహుతైంది. గ్రామ చివర ఉన్న పశువుల పాకలో ఏర్పాటు చేసుకున్న గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో నిప్పు పెట్టారని బాధితుడు వాపోయారు. స్థానికులు గమనించి మంటలు అదుపు చేసేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గ్రాసం మొత్తం కాలిపోయిందని ఆవేదన చెందారు. గడ్డివామితో పాటు పశువుల పాక కూడా కాలిపోయిందని, రూ. 80 వేలు వరకు నష్టం వాటిల్లిందని ఆయన విలపించారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపు
- వర్ధంతి సందర్భంగా గాంధీజీకి ఘన నివాళి


ఉరవకొండలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎంపీ

ఉరవకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి వచ్చారు. దీంతో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కార్యాలయ ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ చేసిన కృషిని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. అలాగే ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఎంపీడీవో రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శిగౌస్ పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలో విశాలాక్షి ఖాదీ సేవా సంస్థ వారు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు నారాయణస్వామి, సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్థానిక విగ్రహం వద్ద ఆర్యవైశ్యులు నివాళులర్పించారు.

కణేకల్లు: మండలంలోని పుల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం జయరామిరెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ హనుమంతరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్రగుప్తా ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు భూమా సూర్యనారాయణ, వంకదారి రాజా, అశ్వర్థరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాల ప్రారంభం


విడపనకల్లులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

విడపనకల్లు/ పెద్దవడుగూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని వ్యవసాయ గోడౌన్ వద్ద వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ప్రతినిధులు గురువారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ పెన్నయ్య మాట్లాడుతూ.. రైతులు కందుల్లో 12శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేసిన కందులు అనంతపురంలోని గోడౌన్‌కు చేరిన వారం రోజులకు రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ పెన్నయ్య, మార్క్‌ఫెడ్ ప్రతినిధులు భాస్కర్, మండల రైతులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని గుత్తి ఏడీఏ వెంకటరాముడు ప్రారంభించారు. ఏఓ మల్లీశ్వరి, ఏఈఓలు సునీత, రజని, టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

గుత్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఎక్సైజ్‌శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నాటుసారాను నిర్మూలించేందుకు నవోదయ 2.0పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 105 గ్రామాలను గుర్తించామన్నారు. మూడు కేటగిరిలుగా ఆయా గ్రామాల్లో సంబంధింత శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు సమష్టిగా గ్రామ సభలను నిర్వహించి. నాటు సారా తయారీ దారులకు చైతన్యం కలిగిస్తారన్నారు. అప్పటికీ వారిలో మార్పు రాకపోతే పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

బెళుగుప్ప, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యలగలవంక సమీపంలో గురువారం కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. గాయాలతో వున్న జింకను గ్రామస్థులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారి పెద్దన్న వచ్చి దానిని మండలకేంద్రంలోని పశువైద్య కేంద్రానికి తరలించి ప్రాథమిక వైద్యసేవలందించారు. తర్వాత అటవీ ప్రాంతంలో వదలగా కొద్దిసేపటికే చనిపోయింది. కుక్కల దాడితోనే తీవ్ర గాయాల పాలై మృతిచెందిందని చెప్పారు. మృతిచెందిన జింకకు పశువైద్య సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే గుమ్మనూరు


ఎద్దులపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అన్ని సమస్యల్ని పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలో నిర్మించిన సీసీరోడ్లను గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల కత్రిమల గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం బహిరంగ సభలో తాము కత్రిమల, పాళ్యం, ఎద్దులపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చామని, ఇచ్చిన హామీ మేరకు నేడు ఆ మాటను నిలుపుకున్నామని తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎద్దులపల్లి, పాళ్యం, కత్రిమల గ్రామాల్లో పర్యటించినప్పుడు ఇక్కడి రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. వర్షాకాలంలో మడుగులను తలపించేలా ఉండడం చూసి తాను ఎంతో వేదనకు గురయ్యానన్నారు. వెంటనే ఈ మట్టి రోడ్లపై సీసీ రోడ్లు వేయాలని ఆనాడే నిర్ణయించుకున్నానని చెప్పారు. అనుకున్నదే తడువుగా ఈ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని సకాలంలో చేపట్టామని తెలిపారు. దీంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎద్దులపల్లిలో రూ. 25లక్షలు, పాళ్యంలో రూ.94.50లక్షలు, కత్రిమలలో రూ.20లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. అలాగే ఎద్దులపల్లిలో మరో రూ.40లక్షల వ్యయంతో డ్రైనేజీ, సీసీ రోడ్లు పనులు జరుగుతున్నాయన్నారు. మున్ముందు గ్రామాల అభివృద్ధికి మరింత తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇచార్జి గుమ్మనూరు ఈశ్వర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లుశ్రీనివాస రెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్ చౌదరి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గౌస్‌పీరా, ఏపీ గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ నాయక్, నాయకులు జింకల సంజీవకుమార్, మునలిరెడ్డి, బొమ్మా మోహన్ కృష్ణ, రామాంజనేయులు యాదవ్, ఆదినారాయణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ ప్రారంభం

పామిడి పట్టణంలోని పీ కొండాపురం గ్రామ రోడ్డులో ఏర్పాటు చేసిన విశాల ఫెర్రర్ దివ్యాంగుల కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... ఈ కమ్యూనిటీ హాలుకు మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అలాగే దివ్యాంగులకు ఓ మంచి రోజున దుస్తులు అందజేస్తానని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు సైతం తన విజయానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ రాజేంద్ర కృష్ణకుమార్, ఈఓ గోపాల్, విభిన్న ప్రతిభా వంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం

- శీర్పి సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం
- ఆవిష్కరించి మూడు రోజులైనా.. అలాగే ఉంచిన వైనం
- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అలెర్ట్


సచివాలయం వద్ద అలాగే ఉన్న జాతీయ జెండా (ఫైల్)

బెళుగుప్ప, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ జెండాను అవనతం చేయకుండా అలాగే ఉంచిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. శీర్పి గ్రామంలోని సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జాతీయ జెండాకు అవమానం కల్గించారంటూ గ్రామస్థులు మండిపడుతున్నారు. నిబంధనల ప్రకారం సూర్యోదయం ఆవిష్కరించి సూర్యాస్తమయంలోగా జాతీయ జెండాను దించి (అవతనం చేసి) కార్యాలయంలో భద్రపరచాలి. కాగా రిపబ్లిక్‌డే సందర్భంగా గత ఆదివారం ఆవిష్కరించిన జెండాను మూడు రోజులవుతున్నా.. పట్టించుకోకుండా కార్యాలయం వద్ద అలాగే ఉంచారు. దీంతో సోషల్ మీడియాలో వైరల్ అయింది. గురువారం ఉదయం మేల్కొన్న అధికారులు జెండాను దించారు. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ షర్మిల సంబంధిత సిబ్బందికి మెమో జారీ చేశారు.

చిరుత సంచారంతో రైతుల ఆందోళన

బెళుగుప్ప, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న గ్రామ శివారులో గల వ్యవసాయ తోటల్లో రెండు రోజుల నుంచి చిరుత సంచరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తోటల్లోకి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నామని గ్రామ రైతులు ఎర్రిస్వామి, నారాయణ స్వామి తదితరులు గురువారం వాపోయారు. అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలకు తరలిరండి

గుంతకల్లుటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో గురువారం ఆ పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బీ శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3వ తేదీలలో నెల్లూరులో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగనున్నాయన్నారు. సీపీఎం నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, నాయకులు సాకేనాగరాజు, జగ్గలి రమేష్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

గుంతకల్లుటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు పూర్తి స్థాయిలో అమలు కాలేదని, హామీల అమలులో ప్రభుత్వం విఫలం చెందిందని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ఇప్పుడు వాటిని పట్టించుకోలేదన్నారు. వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ జింకల రామాంజనేయులు, నాయకులు ఎస్వీఆర్ మోహన్, కౌన్సిలర్లు లింగన్న, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

తాడిపత్రి,జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కడపరోడ్డులో ఉన్న ఐశ్వర్యవిల్లాస్ వద్ద కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు శుక్రవారం భూమిపూజ జరగనుంది. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. అంతకుమునుపు స్థానిక అమ్మవారిశాలలో వాసవీమాతకు ప్రభుత్వ లాంఛనాలతో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. అమ్మవారికి ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

సజావుగా కౌన్సిల్ సమావేశం

గుత్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం సజావుగా సాగింది. ఛైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన, కమిషనర్ జబ్బర్‌మీయా సమక్షంలో నిర్వహించారు. తొలుత అందరూ మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ..తమ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తర్వాత వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ సుంకంను బహిరంగ వేలం వేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

శెట్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీడీ రమేష్ నాయక్ సిబ్బందిని ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణం వేగవంతం చేసి సకాలంలో బిల్లులు అందేలా చూడాలన్నారు. పండ్ల తోటల పెంపకం రైతులకు కూడా సకాలంలో బిల్లులు అందించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించిన టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు కు మెమో జారీ చేసినట్లు చెప్పారు. ఎంపీడీఓ రఘురామారావు, ఏపీఓ ఈసీ రమణ, టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

శెట్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టెల్లిస్ పద్ధతిలో పంటల సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులు ప్రభుత్వం అందజేసే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి గౌసియాబీ గురువారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కొబ్బరిచెట్లు, వెదురు పెంపకంపై ఆసక్తి చేపే రైతులకు ఉద్యానవన శాఖ రాయితీ అందిస్తుందని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

యల్లనూరు, జనవరి30(ఆంధ్రజ్యోతి): కడపలోని శ్రీరామకృష్ణ బాలకాశ్రమంలో 8వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చునని ఎంఈఓ చంద్రశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. రూ. 50 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తును మార్చి 10లోగా కడపలోని రామకృష్ణ మిషన్ కేంద్ర కార్యాలయానికి అందజేయాలన్నారు. 16న ఉదయం 8గంటలకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బాలురకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నీటి సమస్య తీర్చాలంటూ నిరసన

యాడికి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, గుక్కెడు నీరు కూడా దొరక్కపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలోని హౌసింగ్‌కాలనీ వాసులు ఎంపీడీఓ వీరరాజును కోరారు. వారు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చందన రోడ్డులో ఉన్న తమ కాలనీలో నీటి ఎద్దడి అధికంగా ఉందన్నారు. పలుమార్లు విన్నవించినా ఏ ఒక్కరూ సమస్య పరిష్కారానికి కృషిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

శెట్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సింధూరం మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం న్యాయవాదులు పార్థసారథి, దాదాఖలందర్ స్వయం సహాయక సంఘాల సభ్యులకు మహిళా చట్టాలు, న్యాయ సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన మహిళా చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంపీడీఓ రఘురామారావు, మండల సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బొమ్మనహాళ్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో 47 యూనిట్లు బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరు అయినట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. అసక్తిగలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బీసీ ఏకు 18, బీసీ బీకి 13, బీసీ డీకి 6, బీసీ ఈకి 6, కమ్మకు 1, రెడ్డికి 1, ఈబీసీ 2 చొప్పున యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఫిబ్రవరి 7 వరకు దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు.

పుట్లూరు: బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ ప్రకటనలో తెలిపారు. మండలపరిధిలోని ఐదుబ్యాంకులకు కలిపి మొత్తం 26యూనిట్లు మంజూరయ్యాయన్నారు. బీసీ వర్గాల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకోసం ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

సిమెంట్ మిల్లర్‌లో పడి వ్యక్తికి తీవ్రగాయాలు

పుట్లూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు గంగయ్య అనే వ్యక్తి మిల్లర్‌లో పడి తీవ్రగాయాలపాలయ్యాడు. పి. చింతలపల్లి గ్రామానికి చెందిన గంగయ్య సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి కూలి పనులకు వచ్చాడు. మిల్లర్‌లో ఇసుక వేస్తూ ప్రమాదవశాత్తూ పడ్డాడు. గమనించిన తోటికూలీలు కేకలు వేయడంతో మిల్లర్‌ను ఆపేసారు. తీవ్రగాయాలపాలైన గంగయ్యను చికిత్స కోసం తాడిపత్రికి తరలించారు.

హైస్కూల్లో పిచ్చిమొక్కలు తొలగింపు

యాడికి, జనవరి30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశాలతో టీడీపీ నాయకులు గురువారం యాడికి హైస్కూల్‌లో పిచ్చిమొక్కలను తొలగించారు. ఆ హైస్కూల్‌లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయి విషపురుగులు తిరుగుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి వెంటనే అక్కడ శుభ్రం చేయించాలని టీడీపీ నాయకులను ఆదేశించారు. దీంతో నాయకులు పాఠశాల ఆవరణలో ఎక్సకవేటర్ ద్వారా పిచ్చిమొక్కలను తొలగింపచేశారు. పార్టీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, బీసీసెల్ మండల అధ్యక్షుడు నీలకంఠ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మిక సమస్యలను పరిష్కరించండి

రాయదుర్గంరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కొన్ని నెలలుగా నెలకొన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ రీజనల్ అసిస్టెంట్ సెక్రెటరీ సిద్దేశ్వర్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ దామోదర్, డిపో ప్రెసిడెంట్ జిలాన్, డిపో కార్యదర్శి తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు గురువారం డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దవడుగూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవడుగూరు ఎస్సీకాలనీకి చెందిన ఓబులేసు (58) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అనంతపురం పార్లమెంట్ తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

ఆలయాల ఆస్తులను బహిర్గతం చేస్తాం: జేసీపీఆర్


దుకాణాదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

.తాడిపత్రి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి, అశ్వత్థనారాయణస్వామి తదితర ఆలయాలతో పాటు చర్చిలు, మసీదులు, దర్గాలకు చెందిన ఆస్తులను, ఆదాయాలను బహిర్గతం చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంవత్సరానికి ఏ ఆలయం నుంచి ఎంత ఆదాయం వస్తోంది, ఎంత భూమి ఉంది అనేది ప్రజలకు తెలియాలన్నారు. ప్రస్తుతం చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో ఉన్న పాస్టర్లు, ముజావర్లు, పూజారులు బయట వ్యక్తులకు కాకుండా మన మన నియోజకవర్గంలో ఉండేవారికే అవకాశం కల్పించేందుకు చూస్తున్నామన్నారు. ఇక నుంచి ప్రతి ఆలయం, చర్చి, మసీదుకు సంబంధించి ఆదాయంతోపాటు వాటికి సంబంధించి ఆస్తులు అందరికీ తెలిసేటట్లు చేస్తానని ఆయన పేర్కొన్నారు.

విస్తరణ చేద్దామా.. వన్‌వే చేద్దామా..

పట్టణంలోని పుట్లూరు రోడ్డును విస్తరణ చేద్దామా లేదా వన్‌వే చేద్దామా మీ ఇష్టమని జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్లూరు రోడ్డులోని పాత అలీ కంటి ఆసుపత్రి స్థలంలో అక్కడి దుకాణాల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోందని, అందుకు తగ్గట్లు ట్రాఫిక్ కూడా ఎక్కువగా ఉంటోందని తెలిపారు. కనుక రోడ్డు విస్తరణ చేద్దామా లేక వన్‌వే చేద్దామా అని మీ అభిప్రాయాలను తెలుసుకొనేందుకే వచ్చానని చెప్పారు. దీంతో పలువురు దుకాణదారులు వన్‌వే చేయాలని కొందరు, మరింత సమయం కావాలని మరికొందరు కోరారు. దీనికి స్పందించిన ఛైర్మన్ పదిరోజులు సమయం తీసుకోవాలని సూచించారు.

రైల్వే రోడ్లకు మహర్దశ

- రూ.2 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం


అరవిందనగర్ వద్ద తారు రోడ్డు వేస్తున్న దృశ్యం


డీఆర్ఎం కార్యాలయం వెనుక ఆర్‌యూబీ వద్ద నిర్మించిన తారు రోడ్డు

గుంతకల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రైల్వే పరిధిలోని రోడ్లకు మహర్దశ వచ్చింది. ఏళ్లుగా మరమ్మతులు చేయని కారణంగా రైల్వే పరిధిలోని దాదాపు పాతిక రహదారులు గుంతల మయంగా మారిన విషయంపై ఆంధ్రజ్యోతిలో మూడు నెలల కిందట కథనం ప్రచురితమైంది. దీనిపై కదలిన రైల్వే యంత్రాంగం గత డిసెంబరులో రైల్వే కార్యాలయాలు, ప్రధాన రహదారి, రైల్వే కాలనీలలో రోడ్ల నిర్మాణానికి టెండర్లను పిలిచింది. కిందటి నెల బిడ్లను ఖారారుచేయడంతో రైల్వే కాలనీలు, ఆఫీసుల వద్ద రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు.

నిధుల విడుదలతో..

రైల్వే శాఖ స్థానిక పురపాలక సంఘానికి ఆస్తి పన్నులు చెల్లించకపోవడంతో రైల్వే పరిధిలోని రోడ్లను మున్సిపాలిటీ నిర్వహించడం లేదు. రైల్వే శాఖ కూడా రహదారులను మరమ్మతులు చేయడమో, పునర్నిర్మించడమో చేయని కారణంగా దారులన్నీ గుంతలమయంగా మారిపోయాయి. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ పరిసరాలు, జీఆర్పీ రైల్వే జిల్లా కార్యాలయం, వివేకానంద నగర్, మిడతల హంపయ్య మెయిన్ రోడ్డు, రైల్వే స్టేషన్ పరిధిలోని రోడ్లు, రైల్వే ఆసుపత్రి, శాంతినగర్ డబుల్ క్వార్టర్స్, రైల్వే కోర్టు, చర్చి స్కూల్ రోడ్డు, రన్నింగ్ రూం రహదారి, ఇలా ఒక్కటికాదు రైల్వే పరిధిలోని రెండు మూడు రోడ్లు మినహా దాదాపు అన్ని రహదారులూ ధ్వంసమైపోయాయి. ఈ విషయంగా ఆంధ్రజ్యోతి రోడ్లు అధ్వానం పేరిట ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు రూ. 2 కోట్ల వ్యయంతో డివిజనల్ కేంద్రంలోని రహదారుల పునర్నిర్మాణానికి నిధులను విడుదల చేశారు. దీంతో రైల్వే రహదారులకు మహర్దశ పట్టనుంది.

నార్త్ సైడ్ పనులు షురూ..

డివిజనల్ రైల్వే నార్త్ అండ్ సౌత్ విభాగాలుగా రోడ్ల నిర్మాణానికి టెండర్లను నిర్వహించారు. ఈ మేరకు వారం కిందట నార్త్ సైడ్ రోడ్ల నిర్మాణానికి అంకురార్పణ చేశారు. స్థానిక జీఆర్పీ రైల్వే జిల్లా ఎస్పీ కార్యాలయం, వివేకానందనగర్, డీఆర్ఎం కార్యాలయం పక్కన ఉన్న ఆర్‌యూ తదితర రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇంకా సౌత్ సైడ్ రోడ్లయిన రైల్వే స్టేషన్, మెయిన్ రోడ్డు, రైల్వే ఆసుపత్రి, శాంతినగర్ క్వార్టర్స్, డీజల్ షెడ్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టలేదు. త్వరలో ఆ రహదారుల నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నారు. కాగా రైల్వే రహదారులు నిర్మించిన అతి తక్కువ కాలంలోనే ధ్వంసమైపోతున్నాయని, ఈసారైనా నాణ్యంగా నిర్మితమయ్యేలా చూడాలని స్థానిక ప్రజలు, రైల్వే కాలనీల ఉద్యోగులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన